Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 263 | పేజీలు 8 | వెల : 5 | ఫిబ్రవరి 27 గురువారం 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

| తారీఫ్ | బ్లాక్ & వైట్ పేజి |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

## విపక్ష హోదా ఇవ్వాలంటేనే వణుకు

**ఎక్కడ నిలదీస్తామో అన్న భయం**

**అందుకే కారణాలు వెతుకుతున్నారు**

**వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శలు**



**అమరావతి:** ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుతూ అసెంబ్లీలో అసలు ప్రధాన ప్రతిపక్ష గుర్తింపునే ఇవ్వకుండా, ప్రశ్నించే గొంతు వినిపించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మండిపడ్డారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అంటే ఏదో రాజకీయపరమైన హోదాగా కూటమి పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అనేది ఒక బాధ్యత, దీనివల్ల అసెంబ్లీలో ఎక్కువ సమయం ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు ఉండే అవకాశం వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. దీనిని కూడా వక్రీకరించడం దుర్మార్గమన్నారు. ఏపీ అసెంబ్లీలో నాలుగు పార్టీలు ఉంటే, దానిలో మూడు పార్టీలు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాయి. మిగిలిన వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాల్సి ఉంది. పార్లమెంట్ చట్టం 1977 ప్రకారం సభలో సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రధాన ప్రతిపక్షంను గుర్తించాలి. కూటమి ప్రభుత్వం దీనిని ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును వైఎస్సార్‌సీపీ కోరుతుంటే దీనిని రాజకీయం చేయడం దుర్మార్గం. దీనిపై కూటమి పార్టీలు చేస్తున్న ఈ విమర్శలను చూసి ప్రజాస్వామికవాదులే ఆశ్చర్యపోతున్నారని అన్నారు. రిమ్మిది నెలల కూటమి పాలనపై ఇప్పటికే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ప్రారంభమైంది. ఎన్నికలకు

## మెట్రో విస్తరణకు కిషన్ రెడ్డి మోకాలడ్డు

**తనకు పేరొస్తుందనే అడ్డుపుల్లలు వేస్తున్నారు**

**అనుమతులు తీసుకుని వస్తే గండపెండేరం తొడుగుతా**

**కాళేశ్వరంతో లింక్ ఉన్న ముగ్గురు అనుమానాస్పద మృతి**

**కెటిఆర్ వీటిపై ఎందుకు స్పందించడం లేదు**

**ఎఎల్‌బిసి సొరంగం వద్ద సహాయక చర్యలు ముమ్మరం**

మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



2లో..

### హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కు అనుమతి ఇవ్వండి



**ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి**

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి**

**రీజినల్ రింగ్ రైల్... డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి**

**సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి**

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



2లో..

## ప్రయాగ్‌రాజ్‌లో నాగసాధువులు

చివరి రోజు భారీగా వచ్చినట్లు గుర్తింపు



2లో..

## మహాశివరాత్రి రోజు విషాదం

గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురుల గల్లంతు

### జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల

## పునర్విభజన

**దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**



హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాలను పునర్విభజించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలకు శాపంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ తెలిపారు. దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని కేటీఆర్ ప్రశ్నించారు. 'జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం' అని ఆయన మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ నిర్మాణంలో అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని ఆయన అన్నారు. '1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 19.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తర రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్ మరియు బిహార్‌లకు కలిపి 222 సీట్లు వస్తాయి, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయి' అని కేటీఆర్ వివరించారు. 'దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తర రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపాదికగా తీసుకోవాలని కేటీఆర్ ప్రతిపాదించారు. 'తెలంగాణ జనాభా దేశ జనాభాలో కేవలం 2.8 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5.2 శాతం కంటే ఎక్కువ సహకారం అందిస్తోంది. ఇదే విధంగా దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు



## ఫార్మసీరంగంలో అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

**లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో ముందంజ**

**డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో భారత్**

బయో ఏషియా సదస్సు ముగింపు కార్యక్రమంలో కిషన్ రెడ్డి

2లో..



2లో..

## దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం

**సుప్రీంలో కేసుపై స్పందించిన కేంద్రం**

**అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్న కేంద్రం**

**కేవలం ఆరేళ్ల నిషేధం సరిపోతుందని నివేదిక**

దోషులుగా రుజువు అయితే జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు

## నేడు మూడు ఎమ్మెల్సీలకు ఎన్నిక

**భారీగా ఏర్పట్లు చేసిన ఇసి అధికారులు**

**అమరావతి:** రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరుగనున్న ఎన్నికకు ఏర్పట్లు పూర్తి చేశారు. అధికారులు బ్యాలెట్ పత్రలతో తమ ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఇందుకోసం ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది. ప్రధాన పక్షాల అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా ఉంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గురువారం జరగనుంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రచారం జరగడంతో ప్రాధాన్యం నెలకొంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కూటమి తరపున రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు తెదేపా అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారికి రెండుచోట్లా పీడీఎఫ్ నుంచి గట్టిపోటీ ఎదురవుతోంది. ఈ రెండు స్థానాల్ని దక్కించు కునేందుకు కూటమి పార్టీలు సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేశాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ముగ్గురు ప్రధాన అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. అక్కడ ఏపీటీఎఫ్ అభ్యర్థికి అధికార కూటమిలోని తెదేపా, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. కొందరు భాజపా నాయకులు మాత్రం పీఆర్‌టీయూ అభ్యర్థికి మద్దతిస్తున్నారు. వైకాపా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, పాకలపాటి రఘువర్మ మరోసారి అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల స్థానానికి అత్యధికంగా 35 మంది, కృష్ణా-గుంటూరు స్థానానికి 25 మంది, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ



స్థానానికి పదిమంది పోటీలో ఉన్నారు. ఉత్తరాంధ్రలో నువ్వానేనా అన్నట్లుగా పోటీ ఉంది. ఇక్కడ ప్రస్తుత ముగ్గురి మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. రఘువర్మ తరఫున ఉత్తరాంధ్రలోని కొన్ని ఉపాధ్యాయ సంఘాలతో పాటు, తెదేపా, జనసేన పార్టీల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు పనిచేస్తున్నారు. బరిలోంచి వైదొలగిన సుంకరి శ్రీనివాసరావు కూడా రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడిని ఆరెస్సెస్‌తో సంబంధం ఉన్న ఒక ఉపాధ్యాయ సంఘం బలపర్చడంతో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సహా మరికొందరు భాజపా నేతలు ఆయనకు మద్దతిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఈ ఇద్దరు అభ్యర్థుల వర్గీయులు మొదటి ప్రాధాన్యత ఓటు ఒకరికి, రెండో ప్రాధన్యతా ఓటు మరొకరికి పరస్పరం వేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.



## ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు

**మొత్తం 18,180 మందికి రూ. 6వేల చొప్పున జమ**

**హైదరాబాద్:** తెలంగాణలో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసింది ప్రభుత్వం. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నిధులు జమ అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో ప్రభుత్వం నిధులను జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ అయ్యాయి. అయితే ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇంది రమ్మ ఆత్మీయ భరోసా నిలిచిపోయింది. కానీ.. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంత్రి వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది సర్కార్. 66,640 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ అయ్యాయి.

## ప్రయాగ్‌రాజ్‌లో నాగసాధువులు

ప్రయాగరాజ్:మహా కుంభమేళా చివరి రోజు కావడంతోభక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 45 రోజుల పాటు జరుగుతున్న ఈ వేడుకకు ఇప్పటివరకు 65 కోట్లమందికిపైగా భక్తులు హాజరయ్యారు. చివరి రోజు మహాశివరాత్రి సందర్భంగా నాగ సాధువులు కాశీ విశ్వనాథ ఆలయం వైపు వెళ్లి
శివుడికి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అందుకు సంబంధించిన దృశ్యాలను డ్రోన్ విజువల్స్ ద్వారా షూట్ చేశారు. ఈ వీడియోలో ఒకేసారి అనేక మంది సాధువులు ఒక్కసారిగా వెళ్లిన దృశ్యం ఆకట్టుకుంటోంది. ఇది ఆధ్యాత్మికంగా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పవచ్చు. నాగ సాధువులు కుంభమేళా ముగిసిన తర్వాత, తమ ఆధ్యాత్మిక సాధన కొనసాగించడానికి మళ్లీ హిమాలయాలకు తిరిగి వెళతారు. నాగ సాధువులను సాధారణంగా హిందూ సన్యాసులుగా పరిగణించబడతారు. వీరు సాధారణ జీవనం వదిలేసి ఆధ్యాత్మికతను పాటిస్తూ కఠినమైన ధ్యానం, యోగా, ప్రార్ధనలను చేస్తారు. అయితే ఈసారి మహా కుంభమేళా ముగుస్తున్న తరుణంలో మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను కూడా ఇక్కడ తెలుసుకుందాం. వచ్చే ఐదేళ్లలో హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్, ప్రయాగ్ రాజ్ ప్రాంతాల్లో కుంభమేళా జరగనుంది. 2027లో హరిద్వార్‌లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు. అర్ధ కుంభమేళా అంటే ఆరేళ్లకు ఒకసారి వస్తుంది. పూర్ణ కుంభమేళా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. చివరి అర్ధ కుంభమేళా 2021లో హరిద్వార్‌లో జరిగింది. ఈ క్రమంలో 2027లో అర్ధ కుంభమేళా నిర్వహించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మరోవైపు 12 ఏళ్ల తర్వాత వస్తున్న పూర్ణ కుంభమేళా ఈసారి 2027లో నాసిక్‌లో జరగనుంది. తర్వాత మహా కుంభమేళా 2169లో ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమం జూలై 17, 2027న ప్రారంభమై, ఆగస్టు 17, 2027న ముగియనున్నట్లు తెలుస్తోంది. ఇది నాసిక్ నుంచి సుమారు 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నది ఒడ్డున ఉన్న త్రయంబకేశ్వర్‌లో జరగనుంది. 2028లో 12 ఏళ్లకు ఒకసారి జరిగే పూర్ణ కుంభమేళా ఉజ్జయినిలో జరగనుంది. ఆ తర్వాత 2030లో ప్రయాగ్‌రాజ్ లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు.

## మహాశివరాత్రి రోజు విషాదం

కాకినాడ: మహాశివరాత్రి రోజు తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందారు. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతులు టి.పవన్ (17), పి. దుర్గాప్రసాద్ (19), పి.సాయి కృష్ణ (19), ఎ. పవన్ (19), జి.ఆకాశ్ (19)గా గుర్తించారు. వీరంతా కొవ్వూరు, తాళ్లపూడి,
రాజమహేంద్రవరంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. యువకులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలముకున్నాయి. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

## ఫార్మసీరంగంలో అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

**హైదరాబాద్:** హైదరాబాద్ ముత్యాల నగరంగానే కాకుండా, ప్రపంచ ఫార్మసీగా, అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రులు హబ్‌గా ఖ్యాతికెక్కిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 22వ ఎడిషన్ బయో ఆసియా–2025 లాంటి గ్లోబల్ ఈవెంట్స్ నగర వేదికగా జరగడం, హెల్త్‌కేర్ రంగంలోని సాంకేతికత, సుస్థిరమైన పద్ధతుల గురించి చర్చించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బుధవారం బయో ఏషియా–2025 సదస్సు ముగింపు కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో వినూత్నమైన ఆవిష్కర్తలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో భారతదేశం విశేషమైన పురోగతి సాధిస్తోందని చెప్పారు. డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మందులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20 శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయిందన్నారు. 2014లో 15 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కాగా, 2024లో ఇది 27.85 బిలియన్ డాలర్లకు పెరిగిందని అన్నారు. భారత్‌లో ఫార్మా ఉత్పత్తులతోపాటు వివిధ రంగాల్లోనూ ఎగుమతులు పెరిగాయని చెప్పారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంపై కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో పెట్టుబబడులు పెడుతున్న కారణంగానే.. ఈ మార్పులు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో వస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా.. భారతదేశం ఇటీవలే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. సమీప భవిష్యత్తులోనే మూడో స్థానానికి ఎగబాకుందనే విశ్వాసం తమకుందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి ఫలితంగా.. రక్షణ రంగంలో దిగుమతులు చేసుకునే పరిస్థితి నుంచి టాప్ –25 ఎగుమతుల దేశాల జాబితాలో చేరాం. 2014లో ఒక్క మొబైల్‌ఫోన్ కూడా ఎగుమతి చేయలేని పరిస్థితి నుంచి.. ఇప్పుడు రూ.1.28 లక్షల కోట్ల విలువైన మొబైల్‌ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం. రానున్న రెండేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నాం. 2030 నాటికి ఏకంగా 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం. 2047కల్లా భారత్ 18 వేల డాలర్ల తలసరి ఆదాయంతో 30 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్, వేగంగా సమర్థవంతంగా పథకాల అమలు, యువశక్తి సామర్థ్యం, వివిధ రంగాల్లో నిపుణులు, పారిశ్రామికవేత్తలందరి కృషికారణంగానే ప్రగతి సాధిస్తున్నాం. 2014కు ముందు 'ఫియర్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 2014 తర్వాత 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా దేశం
పరివర్తనం చెందింది. ఇదంతా కేంద్ర ప్రభుత్వం అనేక రంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణల కారణంగానే సాధ్యమైంది. జీఎస్టీ అమల్లో అన్ని రంగాల పరిశ్రమలు లబ్ది పొందాయి, ౯÷నాన్షియల్ ఇంక్లూజన్ కారణంగా.. మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి కూడా నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా భారత్‌లో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పలు అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో పేర్కొన్నాయి. ఇటీవల కేంద్రం ప్రకటించిన బ్జడెట్‌లో వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితిని రూ.12 లక్షల వరకు పెంచడం.. భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలాన్నిస్తుంది. హైదరాబాద్ నగరం 'బల్క్ డ్రగ్ క్యాపిటల్', 'వ్యాక్సిన్ క్యాపిటల్'గా పురోగతి సాధించింది. అలాగే ఐటీ ఎగుమతుల్లో లీడర్‌గా నిలిచింది. 2024లో భాగ్యనగరంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా రూ.1.2 లక్షల కోట్ల ఐటీ సేవలు ఎగుమతులు జరిగాయి. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో అంతర్జాతీయంగా పరిశోధనలు, ఏఐ– హెల్త్ కేర్, తయారీ రంగంలో ఎంతో వృద్ధి చెందుతూ 'వసుదైవ కుటుంబకం' భావనకు ప్రతిబింబంగా భారత్ నిలుస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత్ ఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35 శాతం, బల్క్

# దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం

న్యూఢిల్లీ,: వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేళ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. అయితే రాజకీయ నేతలపై జీవిత కాల నిషేధం ఎన్నేళ్లు అనే దానిపై నిర్ణయాధిక –ారం పార్లమెంట్‌దేనని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఖరాకండిగా తేల్చి చెప్పింది. దోషులుగా రుజువు అయితే జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో
దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఆ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.



# మెట్రో విస్తరణకు కిషన్ రెడ్డి మోకాలడ్డు



**న్యూఢిల్లీ,:** హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఆరోపించారు. బుధవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ అంశాలపై స్పందించారు. ప్రధానితో భేటీ సందర్భంగా 5 ప్రధాన అంశాలపై విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు.'కాళేశ్వరంపై పిటిషన్ వేసిన రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. కేసు వాదించిన సంజీవరెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడు. ఈ అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. జ్యుడిషియల్ విచారణ ఎందుకు కోరట్లేదు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై సాంకేతిక నివేదికలు రాకుండా ప్రస్తుతం ఏమీ మాట్లాడను. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న వారిని తీసురావాల్సిన బాధ్యత ఎవరిది? త్వరలో డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది. రాష్ట్ర విజ్ఞప్తులు ఐదింటికి కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం. కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే. మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి
గండపెండేరం తొడుగుతానని అన్నారు. పదేళ్లుగా ఎస్ఎల్‌బీసీ పనులు జరగలేదు. కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పనులు మళ్లీ మొదలయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యత్నిస్తున్నాం. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ వద్ద 11 సంస్థలు పనిచేస్తున్నాయి. సొరంగం వద్ద జరిగింది ప్రమాదం. కాళేశ్వరంలో జరిగింది డిజైన్, నిర్మాణ లోపంతో జరిగిన దుర్ఘటన. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి ప్రధాన కారకుడు జైపాల్‌రెడ్డి. కేసీఆర్ వచ్చాక మెట్రో కోసం చేసిందేమీ లేదు. మెట్రో విస్తరణపై కేసీఆర్ పదేళ్లు తాత్సారం చేశారని మండిపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీకి రూ.22,500 కోట్లు అవసరం. ప్రస్తుతం ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే ఉంది. జీతాలకు రూ.6,500 కోట్లు, వడ్డీలకు రూ.6,800 కోట్లు చెల్లిస్తున్నాం. ఆదాయం రూ.22వేల కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ సెలగంశెట్టి మృతిపై అనుమానాలున్నాయని, దుబాయ్ లో ఉన్న ఆ మాజీ ఎమ్మెల్యే ఎవరో తేలాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మృతిపై కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేదార్ మరణంతో లింకు ఉన్న డ్రగ్స్ కేసును బయటికి తీసి విచారణ చేస్తామని సీఎం చెప్పారు. త్వరలోనే కేదార్ మృతదేహం ఇండియాకు రానుందని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల మూడు అనుమానస్పద మరణాలు సంభవించాయని చెప్పారు. డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న కేదార్, కాళేశ్వరం కేసులు వాదిస్తున్న అడ్వొకేట్ సంజీవ రెడ్డి, కేసు వేసిన రాజలింగమూర్తి మృతి చెందారని, వాటిపై కేటీఆర్ న్యాయవిచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీ గెలుపుకోసం పనిచేస్తోందని అన్నారు. సిబీఐ కేసులు అడ్డం పెట్టుకొని బీఆరెస్ ను విలీనం చేసుకోవాలని ఆలోచనలో బీజేపీ ఉందని సీఎం చెప్పారు. ఫార్ములా ఈ, గొర్రెల పంపిణీ కేసులో కేసులో ఈడీ ఇన్వాల్వ్ అయిందని, ఎందుకు చర్యలు తీసుకోలేదని సీఎం ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు మానిటరింగ్ చేస్తోందని, విదేశాల్లో ఉన్న వారిని తీసుకు రావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీఎం అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా.? అని అన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ల పై కమిషన్ విచారణ సాగుతోందని చెప్పారు. రాత్రిరాత్రికి తాము ఎవరినీ అరెస్ట్ చేయబోమని, అది తమ విధానం కాదని సీఎం చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ కమిషన్లు రావనే ఎస్ఎల్బీసీ పనులను పక్కన పెట్టారని సీఎం అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎస్ఎల్బీసీని 100శాతం పూర్తిచేసి తీరుతామని చెప్పారు. పెరిగిన అంచనాలతో కలిపి 5000 కోట్ల లోపే ఎస్ఎల్బీసీ పూర్తవుతుందని, దీని ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. తాను ప్రధాన మంత్రికి ఐదు విజ్ఞప్తులు చేసి, వినతిపత్రాలు అందించానని, వాటికి నిధులు తీసుకొస్తే బహిరంగ సభ ఏర్పాటు చేసి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి సన్మానం చేస్తానని సీఎం చెప్పారు. ఆ క్రెడిట్ కూడా వాళ్లే తీసుకోవచ్చిన చెప్పారు. తన పాలన అద్భుతంగా ఉందని, ఎవరి ఫోన్లు వారే వింటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాళ్లు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారని చెప్పారు. తన కేబినెట్ లో అనుభవజ్ఞులైన మంత్రులు ఉన్నారని, వారి శాఖలను వారే సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కేంద్రానికి ఎంత మొత్తంలో పన్నులు కడుతున్నామో రాష్ట్రాలకు అంతే వాటా రావాలని అన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని కేటీఆర్ చెబుతున్నారని, ఎలా వస్తాయో తనకు అర్థం కావడం లేదని సీఎం అన్నారు. 2014 నుంచి 2014 వరకు( బీఆర్ఎస్ ప్రభుత్వం) ఉన్న శాసన వ్యవస్థే ఇప్పుడు కూడా ఉందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్ట్ నర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. మెట్రో విస్తరణ జరిగితే తనకు పేరొస్తుందని అనుకుంటున్నారని చెప్పారు. అందుకే కేసీఆర్ హయాంలో జరగలేదు కాబట్టి ఇప్పుడు కూడా జరగొద్దని భావిస్తున్నారని అన్నారు. అందుకే కేంద్ర కేబినెట్ లో మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని చెప్పారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన
## సాయంత్రం 7 గంటలకు వెళ్లాల్సిన విమానం 10:30 వెళ్లిన వైనం



**హైదరాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో సరైన సమయానికి గమ్యస్థానాలకు చేర్చాల్సిన విమానాలు ఇలా ఆలస్యం అవడం పట్ల ప్యాసింజర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా.. మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రయాగ్‌రాజ్ వెళ్సాల్సిన స్పైస్‌జెట్ విమానం ఆలస్యం అవడమే ఇందుకు కారణం. స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మూడు గంటలుగా విమానం కోసం ప్రయాణికులు ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. మూడు గంటలు అవుతున్నప్పటికీ విమానం ఇంకా బయలుదేరకపోవడంపై ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన ప్రయాణికులు విమానం ఆలస్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పైస్ జెట్‌లో సాంకేతిలోపం తలెత్తిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రయాగ్రాజ్ వెళ్లే ప్రయాణికులు మండిపడుతున్నారు. కాగా.. ఇదే నెలలోనే ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం ఐదున్నర గంటల పాటు ఆలస్యంగా నడిచిన విషయం తెలిసిందే. ఈనెల 7న హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన విమానం ఆలస్యం అవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఉదయం 10:30 గంటలకు బయలుదేరాల్సిన దాదాపు ఐదున్నర గంటలు ఆలస్యమైంది. ఐదు గంటల పాటు విమానాశ్రయంలో ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికుల్లో హీరో విజయదేవరకొండతో పలువురు సినీ ప్రముఖులు ఉన్నారు. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు, ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు. అయితే కనీస సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి వెయిట్ చేయించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు రోజు కూడా టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వే వెళ్లిన విమానం ఇంజిన్ మొరాయించడంతో నిలిచిపోయింది. గుహవాటి వెళ్లాల్సిన ఇండియర్ ఎయిర్‌లైన్స్ విమానం రన్‌వే పైకి వచ్చి టేకాఫ్ అవుతున్న సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గమనించిన పైలెట్ వెంటనే ఏటీసీ అధికారులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంజనీరింగ్ నిపుణులు అక్కడకు చేరుకుని దాదాపు గంట పాటు శ్రమించి లోపాన్ని సరిచేశారు. ఆ తరువాత విమానం గుహవాటికి బయలుదేరి వెళ్లింది. అయితే రన్‌వేకు పైకి వెళ్లిన విమానం తిరిగి పార్కింగ్ బే వైపు రావడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే తిరిగి గంటన్నర ఆలస్యంగా విమానం బయలుదేరడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## గరళకంఠుడి కృప అందరిపై ఉండాలి

**రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్**

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు గరళకంఠుని దీవెనలు ఉండాలని ప్రార్థించారు. పవిత్ర శివరాత్రి సందర్భంగా శివ భక్తులు ఉపవాస దీక్షను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించడం హిందూ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకుందని కేసీఆర్ అన్నారు. దేశ వ్యాప్తంగా శివాలయాలు, భక్తుల శివనామస్మరణతో మారుమోగుతాయని అన్నారు. గరళాన్ని తన కంఠంలో దాసుకుని ముల్లోకాలను కాపాడుతున్న ఆ ఉమా శంకరుని కరుణాకటాక్షాలు తెలంగాణ ప్రజలకుండాలని ఆకాంక్షించారు. సుఖ శాంతులతో జీవించేలా ప్రజలందరినీ దీవించాలని కేసీఆర్ ఆ మహాశివున్ని ప్రార్థించారు.

## స్టాలిన్‌కు కేటీఆర్ మద్దతు



హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందన్న వ్యాఖ్యలకు మద్దతిచ్చారు. దేశానికి అత్యవసరమైనప్పుడు కుటుంబ్ర నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను పరిగణనలోకి తీసుకోకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిజంగానే నియోజకవర్గాల పునర్విభన చేయాలని భావిస్తే.. అది దేశానికి అందించే ఆర్థిక సహకారం వాటా ఆధారంగా ఉండాలని ప్రతిపాదించారు. దేశ నిర్మాణానికి తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.8 శాతం మాత్రమే ఉందని.. కానీ దేశ జీడీపీలో మాత్రం 5.2 శాతం కంటే ఎక్కువ వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

## నేడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు
## ఏడు ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ ఏర్పాట్లు

**హైదరాబాద్:** తెలంగాణలో 27న జరుగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు.విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడూతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు.వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా
తీసుకొస్తామని తెలిపారు. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తామని.. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్టాం÷–రగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తామని అన్నారు. స్టాం÷–రగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని అన్నారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కు అనుమతి ఇవ్వండి

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో
విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్–2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.
రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

## సంపాదకీయం

# మోడీ ద్వయం ఏమి చేయబోతున్నది ..?

ప్రధాని మోడీ, అమిత్‌షాలు నిశ్శబ్దంగా ఉన్నారంటే ఎవరికో మూడినట్లే. వారు ఏదైనా అలజడి సృష్టించే ముందు ప్రశాంతంగా ఉంటారు. ఎవ్వరికీ అంతుచక్కకుండా ఉంటారు. వారి వ్యూహాలను పసిగట్టడం వారితో ఉన్నా వారికి కూడా తెలియదు. కాంగ్రెస్ ముక్తభారత్ నినాదంతో రాజకీయాలు నెరిపిన మోడీ కొంతవరకు విజయం సాధించారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు పార్లమెంటులో ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. అయితే ఇదొక్కటే చేయడం వల్ల ప్రజలు హర్షించరు..గుర్తించరని వారు గమనించలేక పోయారు. అందుకే గత ఎన్నికల్లో కాంగ్రెస్ వందసీట్లు గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో అడుగుపెట్టింది. ఆ పార్టీ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. వయనాడ్‌తో పాటు రాయబరేలీలో కూడ రాహుల్ గెలిచి, వయనాడ్‌లో చెల్లెలు ప్రియాంకను మెల్లంగా లోక్‌సభ గడప తొక్కేలా చేశారు. అంతకుముందే తల్లి సోనియా రాజ్యసభలో చేరారు. మొత్తంగా కుటుంబం అంతా పార్లమెంటులో ఉన్నారు. ఇక మిగిలింది రాబర్ట్ వాద్రా మాత్రమే. ఆయన కూడా కర్నాటక లేదా తెలంగాన నుంచి రాజ్యసభ మెట్లు తొక్కినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. అయితే ఇదంతా కాంగ్రెస్ వైపు కనిపిస్తున్న కోణం. మోడీ కోణం మరోటిగా ఉంది. కేవలం 240 సీట్లకే పరిమితమైన బిజెపి, మొన్నటి ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ సాధించలేకపోయింది. ఈ క్రమంలో మళ్లీ కమలం ఆపరేషన్ మొదలవుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తమ కాంగ్రెస్ ముక్త భారత్ వ్యూహంలో భాగంగా మెల్లగా అడుగులు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మరో ఐదేళ్ల వరకు అధికారం కోసం వేచిచూడక తప్పదు. ఈలోగా పార్టీలో ఉన్న వృద్ధనేతలకు అంతకాలం వేచిచూసే ఓపిక ఉండదు. రాజకీయాల్లో ఇప్పుడు తమ వయసురీత్యా కూడా రాజకీయాలు నెరపుతున్నారు. తాజాగా శశిథరూర్ మోడీకి దగ్గరవుతున్నారన్న సంకేతాలు...తుఫాన్‌కు ముందు ప్రశాంతత లాంటివనే చెప్పాలి. అయితే తాను పార్టీ వీడడం లేదని శశిథరూర్ స్పష్టం చేసారు. ప్రతి రాజకీయవేత్త పార్టీ మారు క్రమంలో చేసే సాధారణ ప్రకటన ఇది. అయితే ఒక్క శశిథరూర్ కోసం మోడీ ద్వయం ప్రయత్నించదని గుర్తించాలి. ఆయనతోపాటు మరికొందరి కోసం గాలం వేసివుంటారు. కాంగ్రెస్‌ను చీల్చి చెండాడడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నారు. రాహుల్ నాయకత్వం పట్ల విశ్వాసం లేని వారు వీరివలలో పడడం ఖాయం. కేరళలో సొంతంగా ప్రజలలోఇమేజ్‌ను ఆసరా చేసుకొని వరుసగా నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ ఇప్పుడు పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న రాహుల్ గాంధీపై తిరుగుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. వరుసగా హర్యానా,మహారాష్ట్ర, ఢిల్లీలలో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న తర్వాత 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అన్ని దూరం అవుతున్న సమయంలో శశిథరూర్ వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ శ్రేణులను కలవరం పరుస్తున్న మాట నిజం. 2019లో పార్టీ పరాజయం తర్వాత, 2020లో ఐదుగురు మాజీ ముఖ్యమంత్రులు, పలువురు ఎంపిలు, మాజీ కేంద్ర మంత్రులతో కలిసి 23 మంది పార్టీ అధినేత్రికి రాసిన లేఖలో సైతం తిరుగుబాటు ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలో గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్ లాంటి వారు తమదారి తాము చూసుకున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ఇకముందు సంపూర్ణ మెజార్టీతో తిరిగి అధికారంలోకి వస్తుందని నేతలకు నమ్మకం పోయింది. అందుకే శశిథరూర్ తిరుగుబాటును ఆ విధంగా కొట్టిపారివేయ లేము. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అక్టోబర్, 2022లో జరిగిన ఎన్నికల్లో గాంధీ కుటుంబం బలపరిచిన మల్లికార్జున్ ఖర్గేపై పోటీ చేసి మొత్తం 5000 మంది ఓటర్లలో 1500కు పైగా ఓట్లు సంపాదించడం పార్టీలో విస్తృత ప్రతిపాదికలో థరూర్‌కు గల మద్దతును తెలుపుతున్నది. నిజంగా ఆ నాడు థరూర్‌ను పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకొని ఉంటే నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ బలమైన ప్రాతిపదికను ఏర్పరచుకొని ఉండేదని పలువురు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ను కలిసేందుకు ప్రధాని మోడీ ప్రత్యేకంగా అమెరికాకు వెళ్లిన సందర్భంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తే, శశిథరూర్ మాత్రం ఫలవంతమైన పర్యటన అని పొగడ్తలతో ముంచెత్తారు. అక్రమ వలసదారులు అమానుష రీతిలో పంపడాన్ని మోడీ ప్రస్తావిస్తే బాగుండెడిది అని చురకలు అంటిస్తూనే టారిఫ్‌ల విషయంలో వెంటనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకోకుండా చర్చల పేరుతో వాయిదా వేయగలిగారని కొనియాడారు. తమ రాజకీయ ప్రత్యర్థులను థరూర్ పొగడ్తలతో ముంచెత్తడం సహజంగానే కాంగ్రెస్ నేతలకు ఆగ్రహం కలిగించింది.

# వైభవోపేతంగా చక్రధారుడి చక్రస్నానం





### బాదం, ఎండు ద్రాక్ష, నెమలి ఈకల మాలలతో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

### ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 26

శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. అంతకుముందు ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం 9 నుండి 10 గంటల వరకు పుష్కరిణి ఎదురుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు చక్రస్నానం ఘనంగా జరిగింది. ముందుగా కంకణ బట్టార్ శ్రీ నారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం జరిగింది. ఇందులో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళు „ పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో బాదం, ఎండు ద్రాక్ష, నెమలి ఈకలు, పవిత్రాలు, తులసి, ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

ఎవరైతే బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకొంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారు. రాత్రి 7 నుండి 8 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎంఎల్ఏ శ్రీ పులివర్తి నాని దంపతులు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు శ్రీ మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ శ్రీ రమేష్, ఆలయ అర్చకులు శ్రీ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీ మునికుమార్, శ్రీ ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాల విశేషాలు :**

ఆలయంలోని పోటులో శ్రీ వంశీస్వామి, శ్రీ భానుస్వామి ఆధ్వర్యంలో రోజుకు 10 నుండి 15 వేల మంది భక్తులకు పది రకాల ప్రసాదాలు తయారుచేసి పంపిణీ చేశారు. గరుడసేవ, రథోత్సవం, చక్రస్నానం వంటి పర్వదినాలలో 20 వేల నుండి 25 వేల మందికి ప్రసాదాలు అందించారు.

ప్రజాసంబంధాల విభాగం ఆధ్వర్యంలో మీడియా సెంటర్ ఏర్పాటుచేసి బ్రహ్మోత్సవాల విశేషాలను మీడియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు అందజేశారు. రోజుకు 100 మంది చొప్పున శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో 1800 మందికి వైద్యసేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తొమ్మిది రోజులకు గాను 12 టన్నుల పుష్పాలు వినియోగించారు. 50 మంది సిబ్బంది నిరంతరాయంగా సేవలందించారు. స్నపనతిరుమంజనం, వసంతోత్సవం లాంటి ప్రత్యేక సందర్భాల్లో బెంగళూరు, చెన్నై నుంచి వివిధ రకాల పుష్పాలతో రూపొందించిన మాలలు తెప్పించారు. ఆరోగ్య విభాగం యూనిట్ అధికారి శ్రీ అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి రోజూ 75 మంది పారిశుద్ధ్య కార్మికులతో ఆలయం, పోటు, ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచారు. గరుడసేవ, రథోత్సవం, చక్రస్నానం వంటి ప్రత్యేక దినాలలో 25 మంది అదనపు సిబ్బంది సేవలందించారు.

# తిరుమలలో క్షేత్రపాలకుడికి వేడుకగా అభిషేకం

తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 26.





తిరుమలలోని గోగర్భం సమీపంలో గల రుద్రుని రూపమైన క్షేత్రపాలకుడికి బుధవారం వేడుకగా అభిషేకం జరిగింది. తిరుమల క్షేత్రానికి పాలకునిగా ఉన్న రుద్రునికి మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పారు పత్తేదార్ శ్రీ హిమ్మత్ గిరి, ఆర్జితం ఇన్ స్పెక్టర్ శ్రీ పార్థ సారధి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కుంభమేళాలో హరమరమహాదేవ్

### భారీగా తరలివచ్చిన భక్తజనం

### చివరిరోజు..శివరాత్రి కావడంతో పుణ్యస్నానాలు



**ప్రయాగ్‌రాజ్:** ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా మొదలైన మహాకుంభమేళాకు చివరి రోజు కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు పుణ్యస్నానాలకు పోటెత్తారు. పుణ్యతిథి కావడంతో భారీగా భక్తుల తరలివచ్చారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక ఇక ముగియనుంది. ఈక్రమంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. ఇప్పటివరకు 64 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. ఈ కుంభమేళాలో నేడు చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికారులు భక్తులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలని కోరారు. ఇక, ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఇదిలాఉండగా.. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దీన్ని అమలుచేశారు. స్థానికుల కోసం నిత్యావసర సరకులు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బుధవారం 350 రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. జనవరి 13న ప్రారంభమైన ఈ కుంభమేళా దాదాపు 45 రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటికే రికార్డ్ స్థాయిలో 63.36 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవంగా కుంభమేళా నిలిచింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర కోట్లాది మంది భక్తులంతా పుణ్యస్నానాలు ఆచరించారు. ఇదిలా ఉంటే ఈ కుంభమేళాకు యూపీ ప్రభుత్వం ప్రగడ్బందీగా ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక గుడారాలు, టాయిలెట్లు ఏర్పాటు చేసింది. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసింది. ఇక తప్పిపోయిన వారి సమాచారం తెలియజేసేందుకు 24 గంటలు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య సౌకర్యాలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ కుంభమేళా జరుగుతుంది. అయితే ఈసారి ఊహించని రీతిలో భక్తులు రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పెట్రోల్, ఆహార కొరత ఏర్పడింది. ఇక జనవరి 26న మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మందికి పైగా మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఇక న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కూడా మరో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు అంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఇక ప్రతిపక్షాల విమర్శలను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తిప్పికొట్టారు.





## శ్రీవారికి హైదరాబాద్ భక్తుడి భారీ విరాళం..

తిరుమల శ్రీవారికి మరోసారి భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు భారీ విరాళం అందించారు. శ్రీనివాసులు రెడ్డి అనే భక్తుడు ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించారు. గతంలోనూ ఈయన టీటీడీకి విరాళాలు అందించారు. గతంలో 30 లక్షల వరకూ విరాళాలు సమర్పించగా.. తాజాగా అందించిన మొత్తంతో కలిపి ఇప్పటి వరకూ టీటీడీకి రూ.40 లక్షలు విరాళం అందించారు శ్రీనివాసులు రెడ్డి. ఈ నేపథ్యంలో టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి ఆయనను అభినందించారు.

తిరుమల తిరుపతి దేవస్థానానికి మరోసారి భారీ విరాళం అందింది. టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు హైదరాబాద్ భక్తుడు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు రెడ్డి అనే భక్తుడు టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్ కు రూ.10 లక్షల విరాళాన్ని సోమవారం అందించారు. ఈ మేరకు విరాళం తాలూకూ డీడీని సోమవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కలిసి అందజేశారు. శ్రీనివాసులు రెడ్డి గతంలోనూ టీటీడీకి అనేకసార్లు విరాళాలు అందించారు. టీటీడీలోని వివిధ పథకాలకు రూ. 30 లక్షలను విరాళంగా అందజేసినట్లు టీటీడీ వర్గాలు తెలిపాయి. తాజాగా ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు ఇచ్చిన రూ.10 లక్షలతో కలిపి ఇప్పటి వరకూ శ్రీవారికి రూ. 40 లక్షలు అందించారని తెలిపాయి. ఈ సందర్భంగా దాత శ్రీనివాసులు రెడ్డిని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అభినందించారు.

మరోవైపు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో కొలువైన వెంకటేశ్వర, మహాగణపతి ఆలయాల 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెలాఖర్లో జరగనున్నాయి. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 7 వరక వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 25న సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ జరగనున్నాయి. ఫిబ్రవరి 26న ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం నిర్వహిస్తారు. మార్చి 6వ తేదీన చక్రస్నానం, రాత్రి నిర్వహించే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. మార్చి 7న సాయంత్రం 3-5 గం.ల మధ్యన పుష్పయాగం నిర్వహిస్తారని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

## మాజీ ఎమ్మెల్యేను బయటకు పంపాల్సిందే..

పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీలోల విచిత్రమైన రాజకీయం నడుస్తోంది. ఏపీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైఎస్సార్‌సీపీ నుంచి ముఖ్య నేతలు ఒక్కొక్కరిగా బయటకు వెళ్తున్నారు.. కూటమి పార్టీల్లో చేరుతున్నారు. అయితే సీన్ రివర్స్ అన్నట్లు పల్నాడు జిల్లాలో మాత్రం.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మాకొద్దు బాబోయ్ అంటున్నారు. ఆయన్ను సాగనంపాలంటూ అధిష్టానం పెద్దల్ని కలుస్తున్నారు. ఇటీవల సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ఆయనపై ఫిర్యాదు చేశారు. తాజాగా పార్టీ ఎంపీ, సీనియర్ నే వైవీ సుబ్బారెడ్డిని కలిసి మాజీ ఎమ్మెల్యేను తప్పించాలని కోరారు.

పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం వైఎస్సార్ సీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడి తీరుపై సొంత పార్టీ కేడర్ భగ్గుమం టోంది. తాజాగా వీరందతా పార్టీ ముఖ్య నేత వైవీ సుబ్బారెడ్డిని తాడేపల్లిలో కలిశారు. 'బొల్లాతో కలిసి నడవలేం.. వేరే ఎవరినైనా బాధ్యుడిగా నియమించండి. పార్టీ కార్యాలయం ఆయన ఇంట్లో ఉన్నందున మము వేరేచోట ఏర్పాటు చేస్తాము' అని బొల్లా వ్యతిరేక వర్గం ఫిర్యాదు చేసింది. వినుకొండ వెళ్లిన 80 మందితో సుబ్బారెడ్డి సుమారు అరగంట సమావేశం అయ్యారు. 'తొందరపడొద్దు.. కొద్దికాలం వేచి ఉండండి. పదేళ్లుగా పార్టీలో ఉన్న సీనియర్ నాయకుడు కనుక బొల్లాతో చర్చిస్తాం' అని సుబ్బారెడ్డి వారికి సూచించారు.

ఇటీవల మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు వ్యతిరేక వర్గానికి చెందిన సుమారు వంద మంది కేడర్ తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. 'ఆయనకు సహకరించే ప్రసక్తే లేదు.. మమ్మల్ని తిడుతూ అవమానిస్తున్నారు. నియోజకవర్గ ఇంఛార్జ్ బాధ్యతలు సీనియర్ నాయకుడు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లుకు అప్పగించాలని' కోరారట. కొంతకాలంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు తీరుపై సొంత పార్టీ కేడర్ అసంతృప్తిగా ఉంది. ఆయన్ను ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని వారు కోరుతున్నారు.. కొత్తవారిని ఆ స్థానంలో నియమించాలి అంటున్నారు.

# వైసీపీ కండువా వేసుకోవడానికి ఇష్టపడరా..?

**సభ నుంచి బయటకు వెళ్లే విషయంలో బొత్స, జగన్ మధ్య చర్చ జరిగింది. అలాగే సభ నుంచి వాకౌట్ చేసే సమయంలో జగన్, బొత్స మెడలో కండువాలు కూడా ఉన్నాయి. అయితే ఆ వీడియోను తప్పుదోవ పట్టించేలా బొత్స, జగన్‌లు పార్టీ కండువాలు మెడలో వేసుకోవడానికి ఇష్టపడరని.. బొత్సపై జగన్ ఒత్తిడి చేసి సభ నుంచి బయటకు తీసుకొచ్చారని ప్రచారం జరుగుతోంది.**



ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం చేశారు. అయితే ఈ ప్రసంగానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడ్డుతగిలారు. ఆ తర్వాత అందరూ వాకౌట్ చేసి బయటకు వెళ్లారు. అయితే జగన్, ఆ పక్కనే ఉన్న బొత్సకు పార్టీ (వైఎస్సార్‌సీపీ) కండువా వేసుకోవడం ఇష్టం లేదంటూ వీడియో ఒకటి వైరల్ అయ్యింది. నిజంగానే జగన్, బొత్సకు పార్టీ కండువా వేసుకోవడం ఇష్టం లేదా తెలుసుకుందాం..

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. వెంటనే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగులుతూ నినాదాలు చేశారు. ఐదు నిమిషాలు నినాదాలు చేసిన అనంతరం వైఎస్ జగన్ సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బయటకు వెళ్లిపోయారు. ఆ తర్వాత అసెంబ్లీలో గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించి ముగించారు.. సభ మంగళవారానికి వాయిదా పడింది. అయితే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వాకౌట్ సమయంలో వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఎమ్మెల్సీ బొత్సను జగన్ సభ నుంచి బయటకు వెళదామంటూ ఒత్తిడి చేశారని అందులో ప్రస్తావించారు. బొత్స వద్దంటున్నా జగన్ వస్తావా రావా అని ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరి నిజంగానే జగన్ బొత్సపై ఒత్తిడి తెచ్చారా.. మెడలో పార్టీ కండువా వేసుకోవడానికి కూడా ఇష్టపడలేదా?.. అసలు ఏం జరిగిందో తెలుసుకుందాం..

'బొత్సా వద్దని నిలువరిస్తున్నా.. వస్తావా.. రావా.. అని చెడగొట్టి.. పోదాం పద అటెండెన్స్ వేసుకొన్నాం కదా అని, 2 నిమిషాల్లోనే అసెంబ్లీకి బంక్ కొట్టేశాడు జగన్.. పార్టీ కండువా వేసుకోడానికి కూడా బొత్సా ఇష్టపడనట్లున్నాడు. జగన్ లెక్కన పార్టీ పట్ల నిర్లక్ష్యంతో వచ్చాడు.' అంటూ వీడియోను వైరల్ చేస్తున్నారు. ఆ వైరల్ పోస్ట్ ఇక్కడ, ఇక్కడ, ఇక్కడ గమనించొచ్చు.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో క్లెయిమ్ చేసినట్లుగా జగన్, బొత్సలు పార్టీ కండువాను మెడలో వేసుకోవడానికి ఇష్టపడరు అనే వాదనలో నిజం తేలింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం సందర్భంలో వైఎస్సార్‌సీపీ వాకౌట్ చేసింది. ఆ సమయంలో సభ నుంచి బయటకు వెళ్లే విషయంలో బొత్స, జగన్ మధ్య చర్చ జరిగింది. అలాగే సభ నుంచి వాకౌట్ చేసే సమయంలో జగన్, బొత్స మెడలో కండువాలు కూడా ఉన్నాయి. అయితే ఆ వీడియోను తప్పుదోవ పట్టించేలా బొత్స, జగన్‌లు పార్టీ కండువాలు మెడలో వేసుకోవడానికి ఇష్టపడరని.. బొత్సపై జగన్ ఒత్తిడి చేసి సభ నుంచి బయటకు తీసుకొచ్చారని ప్రచారం జరుగుతోంది.

కానీ వాస్తవానికి.. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగించారు.. అయితే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగిలారు. పోడియం దగ్గరకు వెళ్లి నినాదాలు చేశారు.. కానీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ జగన్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాత్రం వారి స్థానాల్లో నిలబడ్డారు. ఆ సమయంలో ఇద్దరు సభ నుంచి వాకౌట్‌గా వెళ్లే సమయంలో చర్చించుకు న్నారు.. బయటకు వెళదామని జగన్ చెప్ప జగన్, బొత్స సహా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మెడలో కండువాలు కూడా స్పష్టంగా ఉన్నాయి.

'ప్రధాన ప్రతిపక్ష హోదాని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ నుంచి వైయస్ఆర్ సీపీ బాయ్ కాట్. గవర్నర్ ప్రసంగాన్ని కూడా బాయ్ కాట్ చేసి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి బయటికి వచ్చిన వైయస్ జగన్ గారు' అంటూ వైఎస్సార్‌సీపీ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ నుంచి ట్వీట్ చేసింది. అంటే బొత్స, జగన్ మధ్య సంభాషణ తర్వాత అందరూ కలిసి వాకౌట్ చేసి సభ నుంచి బయటకు వచ్చారు. కానీ కొందరు మాత్రం బొత్స వద్దని వారిస్తున్న జగన్ మాత్రం పోదాం పదా అంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చినట్లుగా ప్రచారం చేస్తున్నారని తేలింది. అలాగే బొత్స, జగన్ మెడలో పార్టీ కండువాలు కూడా ఉన్నాయి. సభలో జగన్, బొత్స మాట్లాడుకోవడం.. ఆ తర్వాత వాకౌట్ చేసి బయటకు రావడం.. జగన్, బొత్స సత్యనారాయణ మెడలో వైఎస్సార్‌సీపీ కండువాలు ఉన్న వీడియోలను కొందరు ట్వీట్ (ట్వీట్ 1, ట్వీట్ 2, ట్వీట్ 3) చేశారు

'బొత్సా వద్దని నిలువరిస్తున్నా.. వస్తావా.. రావా.. అని చెడగొట్టి.. పదాం పద అటెండెన్స్ వేసుకొన్నాం కదా అని, 2 నిమిషాల్లోనే అసెంబ్లీకి బంక్ కొట్టేశాడు జగన్. పార్టీ కండువా వేసుకోడానికి కూడా బొత్సా ఇష్టపడనట్లున్నాడు. జగన్ లెక్కన పార్టీ పట్ల నిర్లక్ష్యంతో వచ్చాడు.' అంటూ సోషల్ మీడియాలో వీడియోను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి వైరల్ వీడియోలో జగన్, బొత్సల మధ్య అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడంపై సంభాషణ జరిగింది.. ఆ తర్వాత సభ నుంచి బయటకు వచ్చారు.. బొత్స, జగన్ మెడలో వైఎస్సార్‌సీపీ కండువాలు కూడా ఉన్నాయి.



## పోలీస్ కస్టడీకి వల్లభనేని వంశీ..

గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీని విజయవాడ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు పోలీస్ కస్టడీకి అనుమతించింది. మరింత విచారణ కోసం వల్లభనేని వంశీని పది రోజులు పోలీస్ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతించింది. దీంతో రేపటి నుంచి ఫిబ్రవరి 27 వరకూ వంశీని పోలీసులు విచారించనున్నారు. మరోవైపు వల్లభనేని వంశీకి వెస్ట్రన్ టాయిలెట్, బెడ్ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. కిడ్నాప్ ఆరోపణలపై అరెస్టై, విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ మోహన్‌ను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మూడు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతించింది. మూడు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వల్లభనేని వంశీని పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ విజయవాడ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వల్లభనేని వంశీ వెన్నునొప్పితో బాధపడుతున్న నేపథ్యంలో అతనికి వెస్ట్రన్ టాయిలెట్, బెడ్ సదుపాయాలు కల్పించాలని కోర్టు ఆదేశించింది. లాయర్ సమక్షంలో వల్లభనేని వంశీని పోలీసులు విచారించనున్నారు.

వల్లభనేని వంశీ కస్టడీ పిటిషన్‌పై ఇప్పటికే వాదనలు పూర్తి కాగా.. న్యాయస్థానం ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. గన్నవరం టీడీపీ ఆఫీసులో పనిచేస్ సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారనే ఆరోపణలపై వంశీపై కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు.

అనంతరం కోర్టు ఎదుట హాజరు పరిచి విజయవాడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా మరింత విచారణ కోసం వల్లభనేని వంశీని తమకు 10 రోజులు కస్టడీకి అప్పగించాలని పోలీసులు విజయవాడ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ మీద ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. వంశీని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వల్లభనేని వంశీని పోలీస్ కస్టడీలో విచారించనున్నారు. కస్టడీ సమయంలో వంశీ లాయర్లు ఆయనతో రోజుకు మూడు సార్లు మాట్లాడేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే వల్లభనేని వంశీకి ఉదయం, సాయంత్రం వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించింది.

వెస్ట్రన్ టాయిలెట్ సౌకర్యం కల్పించాలని, మంచం ఏర్పాటు చేయాలని ఆదేశించింది. మరోవైపు గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో సీఐడీ దూకుడు పెంచింది. వల్లభనేని వంశీ మోహన్‌పై అధికారులు పీటీ వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 25న కోర్టులో హాజరు పరచాలని థర్డ్ ఏసీఎం కోర్టు ఆదేశించింది.

## కొత్తగా మరో ఫ్లైఓవర్..

ఏపీకి కేంద్రం మరో శుభవార్త వినిపించింది. కొత్తగా మరో ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. రాజమండ్రిలోని దివాన్ చెరువు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు, రూ.327 కోట్ల రూపాయల వ్యయంతో 2.55 కిలోమీటర్ల పొడవుతో ఈ ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు తెలిసింది. దీంతో కాకినాడ, విశాఖపట్నం వెళ్లేవారికి ఉపయోగ కరంగా ఉండనుంది. మరోవైపు ఈ ప్రాంత వాసుల కోరిక మేరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం తెలిపినందుకు రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం మరో శుభవార్త వినిపించింది. మరో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో రహదారులు, మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఈ క్రమంలోనే మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం శివార్లలో ఉన్న దివాన్ చెరువు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దివాన్ చెరువు వద్ద 2.55 కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్ నిర్మాణా



నికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతవాసులు ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తుండగా.. ఎట్టకేలకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ఫ్లైఓవర్ పూర్తి అయితే 16వ నంబర్ జాతీయ రహదారి, నేషనల్ హైవే 216 మధ్య అను సంధానం పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు. అలాగే రద్దీ తగ్గుతుందని, రోడ్డు భద్రతను మెరుగుపరుస్తుందని చెప్తున్నారు.

రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురా లు దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక చొరవ తీసుకోవటంతో కేంద్రం నుంచి ఆమోదం లభించింది. దివాన్ చెరువు జంక్షన్ వద్ద వాహనాల రద్దీ, వరుస ప్రమాదాల నేపథ్యం లో ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని దగ్గుబాటి పురందేశ్వరి గత కొంతకాలంగా కోరుతున్నారు. ఎట్టకేలకు దివాన్ చెరువు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. మరోవైపు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు నిత్యం ఇక్కడి నుంచి కాకి నాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. పాదచారులతో పాటుగా వాహనాల సంఖ్య పెరగడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. రూ.327 కోట్ల ఖర్చుతో 2.55 కిలోమీటర్ల పొడవుతో ఈ ఫ్లైఓవర్ నిర్మించను న్నట్లు సమాచారం. అలాగే దివాన్ చెరువు జంక్షన్, గామన్ బ్రిడ్జి జంక్షన్, పండ్ల మార్కెట్ వంటి ముఖ్యమైన ప్రదేశాలను లింక్ చేస్తూ ఈ ఫ్లైఓవర్ నిర్మాణ ం జరగనున్నట్లు తెలిసింది. త్వరలోనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నట్లు సమాచా రం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తి అయితే ట్రాఫిక్ సమస్యలు తీరటంతో పాటుగా రహ దారి భద్రత మెరుగుపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## మోగిన ఎన్నికల నగారా.. మార్చి 20న పోలింగ్..




గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగియకముందే.. ఏపీలో మరో ఎన్నికల నగారా మోగింది. ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 20న పోలింగ్, అదే రోజు కౌటింగ్ నిర్వహించనున్నారు. మరోవైపు ఐదు స్థానాలు కూటమికే దక్కే అవకాశాలు ఉండటంతో, కూటమిలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. నాగబాబును మంత్రిని చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా చేసి ఆ తర్వాత మంత్రిని చేస్తారనే వార్తలు వస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న ఐదుగురు సభ్యుల పదవీకాలం మార్చి 29లోగా ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3వ తేదీన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ఉంటుంది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన జంగా కృష్ణమూర్తి, రామారావు, అశోక్ బాబు, యనమల రామకృష్ణుడు, తిరుమల నాయుడు పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సంఖ్యాబలం దృష్ట్యా ఎన్నికలు జరగనున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు కూడా ఎన్డీఏ కూటమి ఖాతాలో చేరే అవకాశం ఉంది. అయితే ఎన్డీఏ కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఈ ఐదు సీట్లు ఎలా పంచుకుంటాయనేదీ ఆసక్తికరంగా మారింది. బీజేపీ కూడా ఎమ్మెల్సీ స్థానం కోరుతుందా.. లేక టీడీపీ, జనసేన పార్టీలకు వదిలేస్తుందా అనేది చూడాల్సి ఉంది.

మరోవైపు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల కోసం కూటమిలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం స్థానాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోసం త్యాగం చేసిన ఎస్వీఎస్ఎన్ వర్మ, మైలవరం సీటును వదులు కున్న దేవినేని ఉమామహేశ్వరరావు సహా గత ఎన్నికల సమయంలో సీట్లు వదులుకున్న నేతలు, అవకాశం రాని లీడర్లు ఎమ్మెల్సీ పదవుల కోసం ఆసక్తి చూపుతున్నట్లు సమా చారం. ఎస్వీఎస్ఎన్ వర్మకు.. ఎన్నికల సమయంలోనే ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని స్వయానా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చా రు. మరోవైపు సీనియర్ నేత అయిన దేవినేని ఉమామహేశ్వరరావును కూడా ఎమ్మెల్సీని చేసి గౌరవించాలని టీడీపీ శ్రేణుల కోరిక.

టీడీపీలో ఇలా ఉంటే జనసేన నుంచి పవన్ కళ్యాణ్ సోదరుడు, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామని తెలుగుదేశం పార్టీ కొన్నిరోజుల కిందట ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ఒక్క స్థానం ఖాళీగా ఉండగా.. ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించినట్లు, నాగబాబుతో భర్తీ చేయనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో నాగబాబును ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని చేసి ఆ తర్వాత మంత్రిని చేస్తారనే వార్తలు వస్తున్నాయి. ఇక ఎమ్మెల్సీలుగా పదవి కాలం ముగియనున్న యనమల రామకృష్ణుడు, అశోక్ బాబు, జంగా కృష్ణమూర్తి వంటి నేతలు మరోసారి అవకాశం కోరుతున్నట్లు తెలుస్తోంది.



## నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలకు రెడీనా..

వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా, వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే అసెంబ్లీలో చంద్రబాబుకు సినిమా చూపిస్తారనే భయం అంటూ సెటైర్లు పేల్చారు అవినాష్ రెడ్డి. ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీలో మాట్లాడేందుకు, ప్రజల పక్షాన మాట్లాడే సమయం, వీలు ఉంటుందన్నారు. జగన్ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ఉప ఎన్నికలకు భయపడుతున్నారంటు న్నారని.. కూటమి గాలిలో కూడా జగన్ 65వేలపైన మెజార్టీతో విజయం సాధించారన్నారు.

కూటమి ప్రభుత్వానికి దమ్ముంటే.. సూపర్ సిక్స్ పథకాలపై రెఫరండంగా.. కుప్పం, మంగళగిరి, పిఠాపురం ఉపఎన్నికలకు వెళ్లే ధైర్యం ఉందా అంటూ అవినాషర్ రెడ్డి సవాల్ చేశారు. కాకమ్మ కబుర్లు, దద్దమ్మ మాటలు కాదని.. దమ్ముంటే కుప్పం, మంగళగిరి, పిఠాపురం, పులివెందుల ఉప ఎన్నికలకు రావాలి అంటూ ఛాలెంజ్ విసిరారు. తన సవాల్ స్వీకరించి ఈ నాలుగు స్థానాల్లో ఉప ఎన్నికలకు సిద్ధమా అన్నారు. ఉప ఎన్నికలకు వస్తే ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో చూద్దామన్నారు. కూటమి ప్రభుత్వం జగన్‌ను అవమానిస్తున్నామని అనుకుంటుందని.. కానీ వారు ప్రజలనే అవమానిస్తున్నామన్న విషయాన్ని మర్చిపోతున్నారు అన్నారు. ఇదిలా ఉంటే కూటమి నేతల వాదన మరోలా ఉంది.. ప్రతిపక్ష హోదా కావాలంటే జగన్ జర్మనీ వెళ్లాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా తానో, చంద్రబాబో ఇచ్చేది కాదు.. జగన్‌కు ప్రజలే ఆ హోదా ఇవ్వలేదన్నారు. ఈ ఐదేళ్లూ వారికి ప్రతిపక్ష హోదా రాదన్నారు. 11 సీట్లు ఉన్న వైఎస్సార్సీపీ ఆ హోదా ఎలా వస్తుందని.. జనసేన పార్టీ కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా ప్రతిపక్ష హోదా వచ్చేదన్నారు. ఓట్ల శాతం ప్రకారం ప్రతిపక్ష హోదా కావాలంటే జగన్ జర్మనీ వెళ్లాలన్నారు. హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాం, లేకపోతే ప్రసంగాలను అడ్డుకుంటామనడం సరైన పద్ధతి కాదన్నారు పవన్ కళ్యాణ్. అయితే అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా దక్కాలంటే ఆ పార్టీకి కనీసం 10 శాతం సభ్యులు ఉండాల్సిందేనని రూల్స్ తెరపైకి తెస్తోంది కూటమి ప్రభుత్వం. అసెంబ్లీ 18 సీట్లు దక్కిన పార్టీలకే ప్రధాన ప్రతిపక్ష హోదా లభిస్తుందని కూటమి నేతలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీకి 11 సీట్లే వచ్చాయని.. అలాంటప్పుడు వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మాత్రం తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని పట్టుబడుతోంది. 40 శాతం ఓట్లు వచ్చిన పార్టీని శాసనసభలో ప్రతిపక్షంగా, ఆ పార్టీ నాయకుడిని ప్రతిపక్ష నేతగా గుర్తించరా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వాళ్లు బయటికి వస్తారని చిన్న ఆశ ఉంది

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరుగుతున్న సహాయక చర్యలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యవేక్షించారు. సీనియర్ నేత జానారెడ్డితో కలిసి పర్యవేక్షించిన అనంతరం.. మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టెన్నెల్‌లో చిక్కుకున్న వాళ్లంతా బయటికి వస్తారని చిన్న ఆశ ఉందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ప్రమాదం జరగటం ఇదే మొదటిసారి అని.. ఇలాంటి సమయంలో రాజకీయాలు చేయటం సరికాదని చెప్పుకొచ్చారు.

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్‌లో జరిగిన ప్రమాదం చాలా విషాదకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులు ప్రాణాలతో బయటకు వస్తారని ఎక్కడో చిన్న ఆశ ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్ వద్ద జరుగుతున్న సహాయ చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం.. మీడియా మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. టన్నెల్‌లో చిక్కుకున్నవారిని రక్షించడమే తమ ముందున్న ప్రధాన బాధ్యత అని.. కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కోమటిరెడ్డి తెలిపారు. అయితే.. ఇంత పెద్ద ప్రమాదం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. వారంతా వందల కిలోమీటర్ల దూరం దాటి పని కోసం వచ్చారని తెలిపిన మంత్రి కోమటిరెడ్డి.. అందరూ ప్రాణాలతో బయటికి వస్తారనే ఆశ మాత్రం తనకు ఉందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదే క్రమంలో.. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును గత ప్రభుత్వమే పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ నేతల్లగా ఏళ్ల తరబడి ఫాంహౌజ్ లో పడుకోలేదని ఎద్దేవా చేశారు. తమను పంపించి సహాయక చర్యలు సమీక్షిస్తున్నారని తెలిపారు. ట్విట్టర్ ఉంది కదా అని కేటీఆర్ ఏది పడితే అది పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన కోమటిరెడ్డి.. ప్రమాదాన్ని రాజకీయం చేయాలనుకుంటే అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు.

టన్నెల్ వద్ద జరుగుతున్న సహాయ చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం.. మీడియా మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. టన్నెల్‌లో చిక్కుకున్నవారిని రక్షించడమే తమ ముందున్న ప్రధాన బాధ్యత అని.. కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కోమటిరెడ్డి తెలిపారు. అయితే.. ఇంత పెద్ద ప్రమాదం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. వారంతా వందల కిలోమీటర్ల దూరం దాటి పని కోసం వచ్చారని తెలిపిన మంత్రి కోమటిరెడ్డి.. అందరూ ప్రాణాలతో బయటికి వస్తారనే ఆశ మాత్రం తనకు ఉందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



ఈ సందర్భంగా ఎక్స్(ట్విట్టర్)లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పోస్టు పెట్టారు. టన్నెల్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించినట్టు తెలిపారు. ఎంత కష్టమైనా సరే టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు ఉన్న అన్ని మార్గాలను ప్రయత్నించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన టన్నెల్ ప్రమాద సంఘటనల్లో చిక్కుకున్న భాధితులను కాపాడిన నిపుణుల అనుభవాలను తీసుకొని వారిని సురక్షితంగా కాపాడే ప్రయత్నం చేస్తున్నామని చెప్పుకొచ్చారు.

ఇదిలా ఉంటే.. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకున్నట్టు అధికారులు తేల్చగా.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, హైడ్రా, ఇండియన్ ఆర్మీ, స్పెషల్ బెటాలియన్ల ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున మట్టిదిబ్బలు ఉండటంతో పాటు నీళ్లు బురద ఎక్కువగా ఉండటం వల్ల సహాయక చర్యలకు ఇబ్బంది ఏర్పాటుతున్నట్టు తెలుస్తోంది.

# నన్ను కేంద్ర మంత్రి కాకుండా అడ్డుకుంది ఈ కొడుకులే

తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. అధికార పార్టీపై ప్రతిపక్ష పార్టీల నేతలే కాదు.. సొంత పార్టీ నాయకులు కూడా బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. మొన్నటివరకు తీన్మార్ మల్లన్న ఓ వర్గంపై ఘాటు కామెంట్లు చేయగా.. ఇప్పుడు సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ హాట్ కామెంట్లు చేశారు. పార్టీలోని ఓ వర్గానికి చెందిన నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో తనను కేంద్ర మంత్రి కాకుండా అడ్డుకున్నారంటూ పలు సందర్భాలు ప్రస్తావిస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు.



తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ఎప్పుడు ఏ నాయకుడు ఏ బాంబు పేలుస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అధికార పార్టీపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తుంటే.. ఇప్పుడు కొత్తగా.. సొంత పార్టీ నేతలే ధిక్కార స్వరం వినిపిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ బీసీ రాగం ఎత్తుకుని సొంత పార్టీకి చెందిన ఓ వర్గం వాళ్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. కాగా.. ఇప్పుడు తీన్మార్ మల్లన్న మార్గంలోనే నడుస్తున్నారు.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్. సొంత పార్టీలోని ఓ వర్గంపై అంజన్ కుమార్ యాదవ్.. తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

సోమవారం (ఫిబ్రవరి 24న) రోజున హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఆదర్శనగర్‌లో యాదవ సామాజికవర్గ నేతల సమావేశం నిర్వహించగా.. అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులగణన చేపట్టి బీసీ కులాల లెక్కలు తేల్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు చెప్పారు. అయితే.. ఈ సందర్భంగా.. అంజన్ కుమార్ యాదవ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో తనకు ఎదురైన కొన్ని సందర్భాలను ప్రస్తావిస్తూ.. సొంత పార్టీలోని ఓ వర్గానికి చెందిన నాయకులపై తనదైన శైలిలో విమర్శలు చేశారు.

రాహుల్ గాంధీ చెప్పడం వల్లే కులగణన జరిగిందని.. లేకుంటే ఈ కొడుకులు ఎప్పుడు కానిస్తుండే? అంటూ అంజన్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ కొడుకులు తెలంగాణనే అడ్డుకున్నారని.. చెప్పుకొచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాంగ్ డిసిషన్ తీసుకుందని.. నిజానికి ఈ సీటును కాంగ్రెస్ పార్టీ యాదవులకు కేటాయిస్తే తప్పకుండా గెలిచేదని అంజన్ కుమార్ తెలిపారు. యాదవులకు ఇవ్వకుండా పార్టీలోనే కొందరు అడ్డు తగిలారని.. యాదవ కులస్తులను కాంగ్రెస్ పార్టీలోని కొందరు ఇప్పటికీ అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని సంచలన విషయాలు చెప్పుకొచ్చారు.

రాజ్యసభ సీటు యాదవులదేనని.. తన కొడుకు పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాజ్యసభ సీటు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. తనకు నేరుగా సోనియా గాంధీ, లాలూ ప్రసాద్ లాంటి వాళ్లు చెప్పడం వల్లే తనకు పీసీసీలో చోటు ఇచ్చారని అంజన్ కుమార్ యాదవ్ కీలక విషయాలు ప్రస్తావించారు. మాజీ పీసీసీ, మాజీ ఎంపీగా చేసినా ఎక్కడ స్వయంగా నిలబడి ఎన్నికల్లో గెలిచింది లేదంటూ వీహెచ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు అంజన్ కుమార్ యాదవ్.

తనకు ఓడిపోయే సమయంలో వచ్చి ఎంపీ టికెట్ ఇచ్చారని.. గెలిచే సమయంలో ఇవ్వకుండా.. ఇంట్లో కూర్చున్న వ్యక్తిని తీసుకొచ్చి సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చి చేజేతులా సీటు కోల్పోయేలా చేశారంటూ దానం నాగేందర్‌ను ఉద్దేశించి అంజన్ కుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఈ భజనగాళ్లు ఇవ్వలేదని.. సోనియా గాంధీతో మాట్లాడి లాలూ ప్రసాద్ యాదవ్ తనను వర్కింగ్ ప్రెసిడెంట్ చేశారంటూ సంచలన విషయాలు వెల్లడించారు. అప్పుడు కూడా తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వకూడదని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి అడ్డు తగిలారని చెప్పుకొచ్చారు. తనకు కేంద్ర మంత్రి పదవి రాకుండా అడ్డుకుంది కూడా ఈ కొడుకులే అంటూ.. ఓ సామాజికవర్గంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. వాళ్లంతా ఎమ్మెల్యేగా ఓడిపోయినా.. మళ్లీ ఎంపీగా టికెట్ తెచ్చుకొని పోటీ చేస్తారని.. కానీ తమకు మాత్రం టికెట్ ఇవ్వమంటే కూడా ఇవ్వరని అంజన్ కుమార్ యాదవ్ మండిపడ్డారు. ఇక నుంచి యాదవ సామాజికవర్గాన్ని తక్కువ చేసి చూసినా.. పార్టీలో ప్రాధాన్యత ఇవ్వకపోయినా ఊరుకునే ప్రసక్తే లేదంటూ అంజన్ కుమార్ యాదవ్ ఓ రేంజ్‌లో వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికే తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. క్రమశిక్షణ కమిటీ నోటీసులు కూడా ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పుడు అంజన్ కుమార్ యాదవ్ కూడా అలాంటి వ్యాఖ్యలే చేయటంతో.. మరి రాష్ట్ర నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# ఆ విషయంలో దేశంలో తెలంగాణే నెంబర్.1



దేశంలోనే తెలంగాణ నెంబర్ 1 అంటూ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది మహిళలు కాంగ్రెస్‌లో సభ్యత్వం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారని.. అందులో లక్ష మంది తెలంగాణ మహిళలే ఉన్నారని అల్కాలాంబ పేర్కొన్నారు. ఈ విషయంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ 1 అంటూ అల్కాలాంబ తెలిపారు. ఈ సందర్భంగా.. రేవంత్ రెడ్డికి, మహేష్ కుమార్ గౌడ్, సునీతా రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలో మహిళల రక్షణ కోసం కేంద్రం చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ కోరారు. మహిళా రిజర్వేషన్లు కేంద్రం వెంటనే అమలు చేయాలని మోదీ సర్కారును అల్కాలాంబ డిమాండ్ చేశారు. సోమవారం (ఫిబ్రవరి 24న) గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన అల్కాలాంబ.. కీలక విషయాలు వెల్లడించారు. దేశంలో 5 లక్షల మంది మహిళా కాంగ్రెస్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. కాగా.. అందులో తెలంగాణ నుంచే లక్ష మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకూ లక్షా 4 వేల మంది తెలంగాణ మహిళా కాంగ్రెస్‌లో సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఈ విషయంలో.. దేశంలోనే తెలంగాణ నెంబర్.1 గా ఉందని అల్కాలాంబ హర్షం వ్యక్తం చేశారు.

**ప్రతి పోలింగ్ బూతులో ముగ్గురు మహిళలను నియమించడానికి మహిళా కాంగ్రెస్ సిద్ధమవుతోందని అల్కాలాంబ తెలిపారు. మహిళా కాంగ్రెస్ పూర్తిస్థాయిలో కార్యవర్గాన్ని ప్రకటించిందని.. అందులో అన్ని జిల్లా అధ్యక్షులన్నారన్నారు.**

కేంద్రంలో పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ విపక్షంలో ఉండి మహిళల హక్కులపై పోరాడుతోందని అల్కాలాంబ చెప్పుకొచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సగం మహిళల పాత్ర ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.500 సిలిండర్ ఇస్తున్నారని.. ఇది దేశం మొత్తంలో కేవలం తెలంగాణలోనే ఇస్తున్నారని వివరించారు. తెలంగాణలో ఇప్పటికే మహిళలకు మూడు హామీలు నెరవేర్చామని... త్వరలోనే నాలుగో హామీ కూడా అమలు చేస్తామని పేర్కొన్నారు. దేశంలో మహిళా పెట్రోల్ బంక్ ఎక్కడా లేదని.. తెలంగాణలోనే మొట్ట మొదటిసారిగా మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు అయిందని.. అందుకు కృషి చేసిన రేవంత్ రెడ్డి సర్కార్‌ను అల్కాలాంబ కొనియాడారు.

తెలంగాణలో ప్రతి పోలింగ్ బూతులో ముగ్గురు మహిళలను నియమించడానికి మహిళా కాంగ్రెస్ సిద్ధమవుతోందని అల్కాలాంబ తెలిపారు. మహిళా కాంగ్రెస్ పూర్తిస్థాయిలో కార్యవర్గాన్ని ప్రకటించిందని.. అందులో అన్ని జిల్లా అధ్యక్షులన్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా, తెలంగాణ నుంచి మహిళలను ఢిల్లీలో ప్రియాంక గాంధీ సత్కరిస్తారని అల్కాలాంబ వివరించారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో చిక్కుకున్న వారి క్షేమం కోసం మహిళా కాంగ్రెస్ ప్రార్థిస్తుందని అల్కాలాంబ తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు మాత్రమేనని తెలిలారు. కాంగ్రెస్‌లో ఒకరికి ఒక పదవి అనే సిద్ధాంతం ఉందని తెలిపిన అల్కాలాంబ.. పార్టీ, ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌తో మాట్లాడుతానని చెప్పుకొచ్చారు. తెలంగాణలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సభ్యత్వం లక్షకు చేరుకున్న నేపథ్యంలో.. జాతీయ మహిళా కాంగ్రెస్ తరపున రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, సునీతా రావుకు అల్కాలాంబ శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణలో మోగిన ఎన్నికల నగారా..

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. తెలంగాణలో 5 స్థానాలు ఖాళీ కానుండగా.. మార్చి3న నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి20న పోలింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఎమ్మెల్యేల సంఖ్యాపరంగా చూస్తే కాంగ్రెస్ 4 స్థానాలు, బీఆర్ఎస్ 1 స్థానం దక్కించుకునే ఛాన్స్ ఉంది. తెలంగాణలో మరోసారి ఎన్నికల నగరా మోగింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో మొత్తం 5 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 3న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండగా.. మార్చి 10 వరకు నామినేషన్లకు తుది గడువు ఇచ్చారు. మార్చి 20న పోలింగ్ జరగనుంది. అదే రోజు ఫలితాలు కూడా వెల్లడి కానున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా కొనసాగుతోన్న హసన్ మీర్జా, యెగ్గె మల్లేశం, శేరి సుభాష్ రెడ్డి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్ పదవీ కాలం మార్చి 29న ముగుస్తుండగా.. ఖాళీ కానున్న ఈ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. తెలంగాణలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 119 కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున 64 మంది విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. వారిలో 10 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. మొత్తం 5 స్థానాలకు గాను సంఖ్యా పరంగా కాంగ్రెస్ నాలుగు స్థానాలు, బీఆర్ఎస్ ఒక స్థానం దక్కించుకునే ఛాన్సుంది. అయితే బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ విప్ జారీ చేసే అవకాశం ఉంది.



ఇక ప్రస్తుతం రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగుతున్నాయి. మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్- కరీంనగర్ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంతో పాటుగా.. నల్గొండ- ఖమ్మం- వరంగల్ టీచర్ స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుంది. ఈ మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉండగా.. కాంగ్రెస్, బీజేపీ, పలువురు స్వతంత్ర్య అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ.. ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ ఎన్నిక ముగియగానే.. మార్చి 3న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండటంతో రానున్న నెల రోజుల పాటు రాష్ట్రంలో ఎన్నికల హడావుడి ఉండనుంది.

# తెలంగాణ మహిళలకు గుడ్‌న్యూస్..

తెలంగాణ మహిళలకు త్వరలోనే రేవంత్ సర్కార్ శుభవార్త వినిపించనుంది. రాష్ట్రంలో కొత్త పథకాల అమలుకు సర్కార్ సిద్ధమైనట్లు తెలిసింది. ఈ మేరకు ముహూర్తం కూడా ఫిక్స్ అయినట్లు సమాచారం. మార్చి8న మహిళలకు నెలకు రూ.2500తో పాటుగా.. మరికొన్ని పథకాల అమలుకు సిద్ధమైనట్లు తెలిసింది.

తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో పాటుగా రూ.500కే గ్యాస్ సిలిండర్ కూడా ఇస్తోంది. మరికొన్ని పథకాల అమలుకు కూడా రెడీ అయింది. రాష్ట్రంలో తెలంగాణ మహిళలకు కొత్త పథకాల అమలుకు రేవంత్ సర్కార్ సిద్ధంది. అందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసినట్లు తెలిసింది. ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా మార్చి 8న కొత్త పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోన్నట్లు సమాచారం.

జిల్లా కేంద్రాల్లో మహిళలకు పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను ఇప్పించేందుకు ఇప్పటికే చమురు సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ ప్రయోజనాలను రూ.2 లక్షలు, రూ.లక్షలకు పెంచుతున్నట్లు ఇది వరకే ప్రకటించగా.. మార్చి 8న అధికారిక ఉత్తర్వులు వెల్లడించే ఛాన్స్ ఉంది. డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ చెక్కులు, గతంలో ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అభయహస్తం సొమ్ములను మహిళల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమైంది. అలాగే అంగన్వాడీలు, సహాయ సంఘాల సభ్యులకు చీరలు అందించనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో కొన్ని గ్యారంటీలను అమలు చేస్తోంది. అయితే ఆరు గ్యారంటీల్లో ముఖ్యమైంది. మహిళలకు నెలకు రూ.2500.



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావొస్తున్న ఈ పథకం ఇంకా అమలు కాలేదు. దీంతో చాలా మంది మహిళలు నెలకు రూ.2500 పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకం అమలుపై కీలక కామెంట్స్ చేశారు. మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడిన ఆయన త్వరలోనే మహాలక్ష్మీ పథకం కింద మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. కాబట్టి మార్చి 8న ఈ పథకాన్న కూడా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# అన్నం పెట్టే రైతన్నతో కన్నీళ్లు పెట్టిస్తున్నారు..



కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూ బాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు.

బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతన్నను నట్టేట ముంచి, నడి రోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంట నీరు పెట్టిస్తున్నరని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# కార్మికుల ప్రాణాల కంటే.. ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం దురదృష్టకరమని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి అన్నారు. 8 మంది కార్మికులు ఇంకా టన్నెల్‌లోనే చిక్కుకుని ఉన్నారని తెలిపారు. వారి ప్రాణాలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నాడు జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. టన్నెల్‌లో చిక్కుకున్న వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అయినప్పటికీ.. తెలంగాణ పునర్నిర్మాణంలో బయట రాష్ట్రాల కార్మికుల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో దాదాపు 35 లక్షల మంది బయటి రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారని జగదీశ్ రెడ్డి తెలిపారు. కరోనా కాలంలో కార్మికులు మన రాష్ట్రం వారా.. పరాయి రాష్ట్రం వారా అనేది కేసీఆర్ చూడలేదని గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా ఎస్-ఎల్‌బీసీ టన్నెల్‌లో ఉన్న ఇతర కార్మికుల ప్రాణాలను రక్షించడం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్మికులను రక్షించడంలో చేయాల్సిన పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.



రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన అత్యంత అభ్యంతరకరంగా ఉందని అన్నారు. టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికుల ప్రాణాల గురించి తెలంగాణ ప్రజలు ఆతృతగా ఆరా తీస్తున్నారని.. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తోలుమందంతో వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

ఈ దుర్ఘటనపై బీఆర్ఎస్ రాజకీయాలు చేయడం లేదని జగదీశ్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రే ఓట్ల కోసం బయల్దేరి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి మాట్లాడారని చెప్పారు తప్ప.. మోదీని రక్షణ చర్యల గురించి అడిగినట్లు ఎక్కడా వెల్లడించలేద ని అన్నారు. మీడియాకు రకరకాల లీకేజీలు ఇస్తున్నారు గానీ.. అసలు వాస్తవాలు ఏంటో వెల్లడించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. టన్నెల్ తవ్వేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని జగదీశ్ రెడ్డి అన్నారు. సీపేజీ ఆగకపోవడం వల్లే గతంలో పనులు ముందుకు సాగలేదని వివరించారు. అసలు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ఒక పెద్ద కుట్ర అని విమర్శించారు. నల్గొండ ప్రజలకు కృష్ణా నీళ్లు రాకుండా చేయాలని గత సమైక్య పాలకులు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. నల్గొండ కాంగ్రెస్ నేతలు నోరు మూసుకుపోవడం వల్లే ఎస్-ఎల్‌బీసీ తెరపైకి వచ్చిందని అన్నారు. చిమ్మ చీకట్లో ఆక్సిజన్ సరిగ్గా ఇవ్వకుండా టన్నెల్‌లో కార్మికులతో పనులు చేయించారని తెలిపారు. తాను పాలమూరు బిడ్డను అని.. తనను కాపాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు.

# చందమామలా మెరిసిపోతారు..!







పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మనకు తెలుసు. పండ్లలోని పోషకాలు.. మన ఆరోగ్యాన్ని సంరక్షించడానికే కాదు సౌందర్య పోషణకూ సహాయపడతాయి. మనం ఆరెంజ్, బొప్పాయి వంటి పండ్లను తొక్క తీసి తింటూ ఉంటాం. వారిని వ్యర్థాల్లో భావించి.. డస్ట్‌బిన్‌లో పారేస్తూ ఉంటాం. అయితే మీరు పెద్ద తప్పు చేస్తున్నట్లే. మీరు చెత్త అనుకునే పండ్లలో మీ అందాన్ని రెట్టింపు చేసే అనేక పోషకాలు నిండి ఉన్నాయి. కమల తొక్కల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతుంది, నల్ల మచ్చలను తగ్గించడానికి, మీరు యంగ్‌లుక్‌లో మెరిసిపోవడానికి కొల్లాజెన్ సంశ్లేషణను ప్రోత్సహిస్తుంది. కమల తొక్కల్లోని న్యాచురల్ యాసిడ్స్ చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తాయి. మృతకణాలను తొలగిస్తుంది, మూసుకుపోయిన రంధ్రాలను క్లియర్ చేస్తుంది. మీకు ప్రకాశవంతమైన రంగును అందిస్తుంది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు. కమల తొక్కలను ఎండబెట్టి.. పొడి చేయండి. రెండు స్పూన్ల పొడిలో పెరుగు, తేనె మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి.. 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత చల్లని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఇది చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది, సహజంగా చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. నిమ్మతొక్కలో ఉండే సిట్రిక్ యాసిడ్ డార్క్ స్పాట్‌లను తేలికపరచడానికి, చర్మపు రంగును సమం చేయడానికి, చర్మంలోని అదనపు నూనెను తొలగించడానికి తోడ్పడుతుంది. సిట్రిక్ యాసిడ్ సహజమైన బ్లీచ్‌లా పని చేస్తుంది. ఇది చర్మం పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది.. స్క్రబ్ తయారు చేయండి, నిమ్మతొక్క పొడిలో చక్కెర, ఆలివ్ నూనె మిక్స్ చేయండి. ఈ పొడితో ముఖం మీద సున్నితంగా వృత్తాకారంలో స్క్రబ్ చేయండి. దీన్ని 10 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత చల్లని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకుంటే.. మెరిసే, మృదువైన చర్మాన్ని పొందవచ్చు. బొప్పాయి తొక్కలు.. బొప్పాయి తొక్కలో పాపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి, ఇవి మృత చర్మ కణాలను తొలగించి చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. పాపైన్ క్రియారహిత ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడం, చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తాయి. ఇది చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతుంది, రంగును ప్రోత్సహిస్తుంది. బొప్పాయి తొక్కలను పేస్ట్ చేసి.. ముఖానికి అప్లై చేయండి. దీన్ని 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. బొప్పాయి తొక్కలలోని ఎంజైమ్‌లు మీ చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తాయి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేస్తే.. మృదువైన, ప్రకాశవంతమైన చర్మం మీ సొంతం అవుతుంది. అరటిపండు తొక్కలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ చర్మాన్ని తేమగా ఉంచుతాయి, మంటను తగ్గించడానికి, ఆరోగ్యకరమైన షైన్‌ను ప్రోత్సహిస్తాయి. అరటి తొక్కలో ఉండే లుటీన్ అనే పదార్థం చర్మాన్ని తేమగా ఉంచి, పోషణనిచ్చి యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. అరటి తొక్క లోపలి భాగంతో మీ చర్మాన్ని కొన్ని నిమిషాల పాటు రుద్దండి. దీన్ని 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. అరటి తొక్కలోని యాంటీఆక్సిడెంట్లు, పోషకాలు.. యవ్వనమైన చర్మాన్ని ప్రోత్సహిస్తాయి. యాపిల్ తొక్కలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి చర్మాన్ని యాక్టివ్ చేస్తాయి, స్థితిస్థాపకతను మెయింటేన్ చేస్తాయి. ఈ తొక్కలోని యాంటీఆక్సిడెంట్లు.. ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మం కణాలను రక్షిస్తాయి. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా రక్షిస్తాయి. మీ ఛాయను ప్రోత్సహిస్తాయి. ఆపిల్ తొక్కలను నీటిలో ఉడకబెట్టి మెత్తగా చేయండి. ఈ నీటిని వడకట్టి, చల్లారనివ్వండి. ఆపై దానిని టోనర్‌గా ఉపయోగించండి. కాటన్ బాల్‌తో దీన్ని ముఖానికి అప్లై చేయండి. ఇది రంధ్రాల బిగుతుగా ఉంచుతుంది, సహజమైన కాంతిని ప్రోత్సహిస్తుంది.

# ఎలుకలు పారిపోతాయ్







ఇంట్లో ఎలుకలుంటే.. పెద్ద తల నొప్పిగా మారతాయ్. దుస్తులు, విలువైన డాక్యుమెంట్లు, బుక్స్, వైర్లను కొరికి నాశనం చేసేస్తుంటాయ్. ఇంట్లో ఉన్న చెక్కలను సైతం కొరికి వేస్తాయి, పండ్లు, కూరగాయలు వేటినీ మిగల్చవు. ఎలుకలు అనారోగ్యాలను వ్యాప్తి చేస్తాయి. అందుకే ఎలుకల బెడదను ఎంత త్వరగా వదిలించుకుంటే.. అంతమంచిది. ఇంటి నుంచి ఎలుకలను తరిమికొట్టడానికి మార్కెట్లో దొరికే కెమికల్స్ వాడుతుంటారు. అయితే వీటి కారణంగా కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, కొన్ని న్యాచురల్ టిప్స్ ఎలుకలను ఇంటి నుంచి తరిమికొట్టడానికి తోడ్పడతాయి. ఎలుకలకు మింట్ వాసన పడదు. ఆ వాసనకు ఎలుకలు చిరాకు పడతాయి. మీరు ఎలుకలతో ఇబ్బంది పడుతుంటే.. మింట్ ఆయిల్‌లో ముంచి కాటన్ బాల్స్‌ను ఇంట్లోని వివిధ ప్రదేశాల్లో ఉంచండి. ఇలా చేస్తే.. ఎలుకలు ఇంటిని వదిలి పారిపోతాయి. లవంగం నూనె ఎలుకలకు పడదు. దీని ఘాటైన వాసనకి బయటకు వెళ్లిపోతాయి. అందుకోసం కాటన్‌బాల్స్ తీసుకుని వాటిని లవంగం నూనెలో ముంచి ఇంటి మూలల్లో ఉంచాలి. ఇలా చేస్తే ఎలుకల బాధ తప్పుతుంది. ఉల్లిపాయల వాసనంటే ఎలుకలకు పడదు. ఈ వాసనకు ఎలుకలు చిరాకుపడిపోతాయి. ఆ దరిదాపుల్లోకి రావు. ఇంట్లోనే చిన్న చిన్న కన్నాలు ఉన్న చోట ఉల్లిపాయలను ఉంచండి. ప్రతి రెండురోజులకొకసారి వీటిని మారుస్తూ ఉండాలన్న విషయం మరచిపోకండి. ఇలా చేస్తే.. ఎలుకల సమస్య దూరం అవుతుంది. ఎలుకలు అమోనియా వాసనని తట్టుకోలేవు. లీటరు నీళ్లల్లో కొద్దిగా అమోనియా, లిక్విడ్ డిటర్జెంట్‌లు కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్లో వేసి ఎలుకలు తిరిగే చోట చల్లాలి. ఇలా చేస్తే.. మీ ఇంటి నుంచి ఎలుకలు పారిపోతాయ్. బిర్యానీ ఆకులు.. బిర్యానీ ఆకులు ఎలుకలు తిరిగే ప్రదేశంలో పెడితే.. ఆ స్మెల్ కు ఆ చుట్టుపక్కల ప్రదేశానికి ఎలుకలు రావు. ఎలుకలు కలరా ఉండలు ఉంచిన ప్లేస్‌కు రావు. కలరా ఉండల నుంచి వచ్చే ఘాటు స్మెల్‌తో ఎలుకలు అటువైపు దరిచేరవు. చెంచా వెల్లుల్లి రసాన్ని అరలీటరు నీటిలో కలిపి గది మూలల్లో స్ప్రే చేస్తే ఎలుకల బెడదను అరికట్టొచ్చు. వంటగది వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. ఇప్పుడు మార్కెట్‌లో ఎలుకల్ని పట్టే ర్యాట్ ప్యాడ్‌లు దొరుకుతున్నాయి. వాటిని ఇంట్లోని మూలలు, అటకలు, చీకటి గదుల్లో పెడితే వాటి జిగురుకి అతుక్కుంటాయి. తర్వాత దూరంగా పడేస్తే సమస్య వదిలిపోతుంది.

# ఎనర్జీ లెవల్స్ పడిపోతాయ్..!








మనం ఏ పని చేయాలన్నా.. శక్తి చాలా అవసరం. మానసికంగా, శారీరకంగా ఎనర్జిటిక్‌గా ఉంటేనే.. మన రోజూ వారీ కార్యక్రమాలు సమర్థవంతంగా చేయవచ్చు. రోజువారీ అలవాట్లు మన శక్తి స్థాయిలను గణనీయంగా ప్రభావితం చేస్తాయి. రెగ్యులర్ వ్యాయామం, సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని కంట్రోల్‌లో ఉంచుకోవడం వంటివి మన శక్తి స్థాయిలను మెరుగుపరుస్తాయి. ఈ అలవాట్లు శరీర పనితీరును ప్రోత్సహిస్తాయి, శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి, ఆక్సిజన్ సరఫరాను పెంచుతాయి, శరీర జీవక్రియను ప్రోత్సహిస్తాయి. అయితే, కొన్ని అలవాట్లు శక్తి స్థాయిలను తగ్గిస్తాయి. ఇవి మీ పనితీరును ప్రభావితం చేస్తాయి. ఈ రోజుల్లో డిజిటల్ స్క్రీన్స్ వాడకం ఎక్కువ అవ్వడం, ఒత్తిడి కారణంగా చాలా మంది నిద్రను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆలస్యంగా నిద్రపోవడం, తగినంత నిద్ర లేకపోవడం వల్ల మన శక్తి స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. మీ ఎనర్జీ లెవల్స్ స్థిరంగా ఉంచుకోవడానికి.. ప్రశాంతమైన నిద్ర చాలా అవసరం. ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోండి. బిజీలైఫ్ స్టైల్ కారణంగా కొంతమంది ఫుడ్ స్కిప్ చేస్తూ ఉంటారు. అంతేకాదు, ఆహారం మానేస్తే బరువు తగ్గుతాం అనే అపోహలో ఉంటారు. భోజనం మానేస్తే, ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేస్తే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. అలసట, నిస్సత్తువ, నీరసం ఆవహిస్తాయి. మీ ఎనర్జీ లెవల్స్‌ను మెయింటేన్ చేయడానికి.. రోజూ సమతుల్య ఆహారం తీసుకోండి. మీ డైట్‌లో పోషకాలు అధికంగా తీసుకోండి. నిశ్చల జీవనశైలి.. శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల అలసట, నీరసంగా అనిపించవచ్చు. ఎనర్జీ లెవల్స్ పెంచడానికి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. డెస్క్ జాబ్ చేసేవాళ్లు.. గంటకు ఒకసారైనా బ్రేక్ తీసుకోండి. కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే.. కెఫిన్ శరీరానికి.. తాత్కాలిక శక్తిని అందించగలిగినప్పటికీ, అది ఎక్కువగా తీసుకుంటే డిపెండెన్సీకి దారి తీస్తుంది, మీ శక్తి స్థాయిలను తగ్గిస్తుంది. కాఫీ, కూల్ డ్రింక్స్ వంటి కెఫిన్ డ్రింక్స్‌ను తక్కువగా తీసుకోండి. వీటికి బదులుగా నీళ్లు, హెర్బల్ టీ, పండ్ల రసాలు తీసుకోండి. ఇవి శరీరానికి స్థిరంగా శక్తిని అందిస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇది అలసట, శక్తి స్థాయిలు పడిపోవడానికి కారణం అవుతుంది. మీరు రోజూ.. కనీసం 8 గ్లాసుల నీరు కచ్చితంగా తీసుకోవాలి. సూర్యకాంతి తగలకపోతే.. సిర్కాడియన్ రిథమ్‌కు అంతరాయం కలుగుతుంది. ఇది శరీర శక్తి స్థాయిలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మీరు నిద్ర చక్రాన్ని మెయింటేన్ చేయడానికి.. ఉదయం, సాయంత్రం పూట కొంతసేపు ఎండలో ఉండండి. స్వీట్స్, చక్కెర ఆహారాలు ఎక్కువ తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఇది ఎనర్జీ క్రాష్‌లకు దారితీస్తుంది. శక్తి స్థాయిలను మెయింటేన్ చేయడానికి.. సమతుల్య ఆహారం తీసుకోండి, చక్కెరను పరిమితంగా తీసుకోండి. ఒత్తిడి స్థాయిలు ఎక్కువగా ఉంటే.. శరీరంలో శక్తిని హరిస్తుంది. ఇది మీ ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఒత్తిడి స్థాయిలను తగ్గించడానికి ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు వంటి ప్రాక్టిస్ చేయండి.





# ఖాళీ కడుపుతో తాగితే మంచిది










షుగర్.. ఇది ఒకసారి వచ్చిందంటే పూర్తిగా నయం కాదని మనకు తెలుసు. మందులతో, జీవనశైలి మార్పులతో, సమతుల్య ఆహారం తీసుకుంటూ.. దీని కంట్రోల్‌లో ఉంచుకోవటం తప్పించి మరో మార్గం లేదు. డయాబెటిక్ పేషెంట్స్.. దీర్ఘకాలంపాటు రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచుకోకపోతే చూపు పోవటం, నాడులు దెబ్బతినటం, పాదాల మీద పుండ్లు పడటం, కిడ్నీలు దెబ్బతినడం వంటి దుష్ప్రభావాలకు దారితీస్తుంది. అందుకే షుగర్ పేషెంట్స్ వారి డైట్ విషయంలో ప్రత్యేక కేర్ తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. వారి డైట్‌లో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, హెల్తీ ఫ్యాట్ ఫుడ్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు. డయాబెటిక్ పేషెంట్స్ ఉదయం పూట కొన్ని హెల్తీ డ్రింక్స్ తీసుకుంటే.. బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయని నిపుణులు అంటున్నారు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

నిమ్మరసం నీళ్లు.. షుగర్ పేషెంట్స్ ఉదయం పూట ఖాళీ కడుపుతో.. నిమ్మరసం నీళ్లు తాగితే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఒక గ్లాస్ గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం వేసి రోజూ తాగండి. ఇది శరీరాన్ని డిటాక్స్ చేస్తుంది, బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది. దాల్చినచెక్క ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. మీరు రోజూ ఉదయం పూట దాల్చిన చెక్క టీ తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి. కాకరకాయలో ఇన్సులిన్ చర్యను అనుకరించే సమ్మేళనాలు ఉన్నాయి, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. షుగర్ పేషెంట్స్ ఉదయం పూట కాకరకాయ జ్యూస్ తాగితే.. షుగర్ కంట్రోల్‌లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మెంతుల్లో ఫోలిక్ యాసిడ్, రైబోఫ్లావిన్, రాగి, పొటాషియం, క్యాల్షియం, ఐరన్, మాంగనీసుతో పాటు ఎ, బి6, సి, కె విటమిన్ల వంటి పోషకాలెన్నో ఉంటాయి. షుగర్ పేషెంట్స్‌లో బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచడానికి.. మెంతులు ఉపయోగపడుతున్నట్టు భారతీయ వైద్య పరిశోధన మండలి నివేదిక పేర్కొంటోంది. వీటిల్లో నీటిలో కరిగే పీచు దండిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను, పిండి పదార్థాలను గ్రహించుకోవటాన్ని నెమ్మదింపజేస్తుంది. ఇలా రక్తంలో గ్లూకోజు నెమ్మదిగా కలిసేలా చేస్తుంది. ఫలితంగా గ్లూకోజు మోతాదులు అదుపులో ఉంటాయి. మెంతి గింజల్లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. మీరు మెంతి గింజలను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటిని తాగవచ్చు. ఉసిరిలో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలోని చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది, దీంతో బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇమ్యూనిటీని బూస్ట్ చేయడానికి తోడ్పడుతుంది. కలబంద జ్యూస్.. షుగర్ పేషెంట్స్ ఉదయం ఖాళీ కడుపుతో కలబంద జ్యూస్ తాగితే మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కలబందలో లెక్టిన్లు, ఆంత్రాక్వినోన్స్ ఉంటాయి. వీటిలో సహజంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించే యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉంటాయి. రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించడమేకాక డయాబెటిస్ అదుపులో ఉంచుతుంది. తులసి ఆకుల్లో యాంటీ–డయాబెటిక్ లక్షణాలు ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతుంది. షుగర్ పేషెంట్స్ రోజూ ఉదయం పూట.. తులసి టీ తీసుకుంటే మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# సయాటికా నొప్పి దూరం అవుతుంది..!





శారీరక అనారోగ్యాన్నైనా, మానసిక సమస్యనైనా దూరం చేసే శక్తి యోగాకు ఉందనడం అతిశయోక్తి కాదు. అందుకే చాలామంది వారి డైలీ వర్క్‌అవుట్ రొటీన్‌లో యోగాను చేర్చుకుంటారు. యోగా మనసుకి, శరీరానికి, మెదడుకి హాయిని ఇస్తుంది. ఒక్కొక్క యోగాసనం ఒక్కో ప్రయోజనాన్ని అందిస్తుంది. వాటిలో వృక్షాసనం ఒకటి. వృక్షం అంటే చెట్టు అని అర్థం. ఈ భంగిమ చెట్టుని పోలి ఉంటుంది. అందుకే దీన్ని వృక్షాసనం అని పిలుస్తారు. వృక్షాసనం రోజూ ప్రాక్టిస్ చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వృక్షాసనం వేయడానికి ముందుగా.. రెండు కాళ్లూ దగ్గర పెట్టుకుని నిలబడాలి. మెల్లగా కుడికాలును పైకి లేపి కుడి పాదాన్ని ఎడమ తొడ మీద ఆనించి అరికాలితో కొద్దిగా నొక్కుతున్నట్లుగా ఉంచి ఒక్క కాలిమీద నిలబడాలి. మెల్లగా శ్వాస తీసుకుంటూ రెండు చేతులనూ భుజాల మీదుగా తల పైకి తిన్నగా తీసికెళ్లి నమస్కార ముద్రలో ఉంచాలి. చూపును ముక్కు అంచు మీద కేంద్రీకరించాలి. ఈ ఆసనంలో ఉండగలిగినంత సేపు ఉండాలి. మెల్లగా చేతులను, కాలును కిందికి దింపి రిలాక్స్ అవ్వాలి. ఇలాగే రెండో కాలితో చేయాలి. రెండు కాళ్లతో కలిపి రోజూ ఐదు నిమిషాలు చేస్తే మంచి రిజల్ట్స్ ఉంటాయి. మైదా, వరి పిండి బదులు ఈ పిండ్లు వాడితే.. ఆరోగ్యంగా ఉంటారు..! కాళ్ల కండరాలను టోన్ చేస్తుంది.. కాళ్ల కండరాలను టోన్ చేస్తుంది.. వృక్షాసనం రోజూ ప్రాక్టిస్ చేస్తే.. కాళ్ల కండరాలు టోన్ అవుతాయి.

రోజూ ఈ ఆసనం ప్రాక్టిస్ చేస్తే.. తొడల నుంచి పాదాల వరకు కండరాలు టోన్ అవ్వడం మీరే గమనిస్తారు. ఒక కాలుపై నిలబడటం వల్ల.. కండరాలు టోన్ అవుతాయి. వృక్షసనం శరీర ఫ్లెక్సిబిలిటీని కూడా మెరుగు పరుస్తుంది. పిరుదుల్లోని కండరాలు దృఢంగా, ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. జుంబా డాన్స్ చేస్తూ.. హ్యాపీగా, సులభంగా బరువు తగ్గేయండి..! ఈ ఆసనం రోజూ ప్రాక్టిస్ చేస్తే.. శరీరం, మనస్సును బ్యాలెన్స్ చేస్తుంది. ఇది బ్యాలెన్సింగ్ ఆసనం కనుక మనల్ని మనం నియంత్రించు కోగలుగుతాం. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. పని మీద ధ్యాస నిలిపి అనుకున్నది సాధించ గలుగుతారు. ఈ ఆసనం రోజూ చేస్తే.. మన శరీరం చాలా ప్రశాంతంగా, మరింత స్థిరంగా మారుతున్నట్లు మీరు భావిస్తారు. కటి ఎముకలను బలపరుస్తుంది.. ఈ ఆసనంలో శరీర బరువు అంతా ఒక కాలుపై ఉంటుంది. ఇది మీ కటి, తుంటి ఎముకలను బలపరుస్తుంది. తుంటి ప్రాంత ఫ్రెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది.

వృక్షాసనం గర్భాశయం, అండాశయ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. వృక్షాసనం వల్ల వెన్నెముక బలపడుతుంది. ఛాతీ విశాలం అవుతుంది. భుజాల సత్తువ పెరుగుతుంది. కటి వలయం ఎముకలు ఓపెన్ అవుతాయి. పిక్కల కండరాలు దృఢమవుతాయి.
సయాటికా నుంచి ఉపశమనం ఇస్తుంది..
సయాటికా నుంచి ఉపశమనం ఇస్తుంది..
వృక్షాసనం రోజూ ప్రాక్టిస్ చేస్తే.. సయాటికా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. సరైన భంగిమలో కూర్చోకపోవడం, జీవనశైలి సమస్యలు, స్లిప్డ్ డిస్కులు వంటి కారణాల వల్ల సయాటికా నొప్పి వస్తుంది. వృక్షాసనం రోజూ వేస్తే.. శరీర భంగిమ మెరుగుపడుతుంది. ఇది సయాటికా నొప్పిని తగ్గిస్తుంది.
వృక్షాసనం రోజూ ప్రాక్టిస్ చేస్తే.. ఏకాగ్రత పెరుగుతుంది. ఇది మీ శరీరాన్ని, మనస్సను బ్యాలెన్స్ చేస్తుంది. ఈ ఆసనం రోజూ ప్రాక్టిస్ చేస్తే.. ఏకాగ్రత పెరుగుతుంది. ఏకాగ్రతలో ఇబ్బందిగా ఉన్న అటెన్షన్ డెఫిసిట్ హైపర్యాక్టివిటీ డిజార్డర్ ఉన్న వ్యక్తులలో ఏకాగ్రతను పెంపొందించడానికి వృక్షాసన ప్రయోజనకరంగా ఉంటుందని ఓ అధ్యయనం స్పష్టం చేసింది. వృక్షాసనం అనేక ప్రయోజనాలు అందిస్తున్నప్పటికీ కొన్ని సమస్యలు ఉన్న వాళ్ళు దీన్ని వేయకపోవడమే మంచిది. హైపర్‌టెన్షన్, మైగ్రేన్, నిద్రలేమి, తలనొప్పి, కాళ్లు, చేతులు, వీపుపై గాయాలు ఉన్న వ్యక్తులు నిపుణులను సంప్రదించి ఈ ఆసనం వేయాలి.

# ఏకంగా 174 శాతం ప్రీమియంతో ఎంట్రీ!



స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారు ముఖ్యంగా ఐపీఓల కోసం ఎదురుచూస్తుంటారు. ఇవి లిస్టింగ్‌తోనే బంపర్ రిటర్న్స్ ఇస్తుంటాయి. గతేడాది ఆఖర్లో స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లిన నేపథ్యంలో.. పలు ఐపీఓలు ఇన్వెస్టర్లకు మంచి లాభాలు అందించాయని చెప్పొచ్చు. ఇప్పుడు చాలా రోజుల తర్వాత ఒక ఐపీఓ భారీ లాభాలు నమోదు చేసింది. లిస్టింగ్‌తోనే 174 శాతం ప్రీమియం నమోదు చేసి.. మళ్లీ అప్పర్ సర్క్యూట్ కొట్టింది.
మీరు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారా? మరి సరైన స్టాక్స్ ఎంచుకుంటున్నారా? ఇంకా ఆర్థిక నిపుణుల సలహా కూడా తీసుకోవాలి. మార్కెట్లను జాగ్రత్తగా గమనిస్తూ ఒక పద్ధతిలో పెట్టుబడులు పెడుతుండాలి. ఇలా దీర్ఘకాలంలో చాలా స్టాక్స్ మంచి రిటర్న్స్ అందిస్తుంటాయి. ఇంకా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. వీటిల్లో చాలా వరకు మంచి ప్రీమియంతో స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అవుతుంటాయి. స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి. 100 శాతం నుంచి 250 శాతం వరకు తొలిరోజే పెరగడం విశేషం.

ఇప్పుడు ఇదే బాటలో చాలా రోజులకు మరో ఐపీఓ అదిరిపోయే రిటర్న్స్ లిస్టింగ్‌లోనే నమోదు చేసింది. ఇష్యూ ధర రూ. 106 కాగా.. ఏకంగా 173.58 శాతం ప్రీమియంతో రూ. 290 వద్ద లిస్టయింది. ఇదే టీఏసీ ఇన్ఫోసెక్ స్టాక్. అక్కడితో ఆగలేదు తర్వాత మరో 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో చివరకు 187 శాతం లాభంతో రూ. 304.50 వద్ద స్థిరపడింది. దిగ్గజ పెట్టుబడిదారుడైన విజయ్ ఖేడియా ఇన్వెస్ట్ చేసిన ఈ ఐపీఓ మార్చి 27 (బుధవారం) సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. ఏప్రిల్ 2న (మంగళవారం) ముగిసింది. ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది. సబ్‌స్క్రిప్షన్ చివరి రోజున ఏకంగా 422.03 రెట్ల స్పందన లభించింది. ఇక ఇది ఎక్స్ఛేంజీలో లిస్టవగా.. ఒక్కో లాట్ కింద కనీసం 1200 షేర్లు ఓపెన్ చేయాల్సి ఉంటుంది. అంటే దీనికి పెట్టుబడి రూ. 1.27,200 గా ఉంది. ఇక లిస్టింగ్ రిటర్న్స్ చూస్తే 187 శాతానికిపైగా లాభం అంటే ఏకంగా రూ. 2,38 లక్షల మేర లాభం వచ్చింది. మొత్తం పెట్టుబడిని రూ. 3.65 లక్షలు చేసింది. టీఏసీ ఇన్ఫోసెక్ కంపెనీ విషయానికి వస్తే ఇది 2016 లో ప్రారంభమైంది. సైబర్ సెక్యూరిటీ క్వాంటిఫికేషన్, పెనెట్రేషన్ టెస్టింగ్, వెల్నరబులిటీ మేనేజ్‌మెంట్, అసెస్‌మెంట్‌కు సంబంధించి రిస్క్ బేస్డ్ సొల్యూషన్స్ అందిస్తుంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బంధన్ బ్యాంక్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ-గవర్నెన్స్ వంటి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, రెగ్యులేటర్లు దీనికి క్లయింట్లుగా ఉన్నాయి.

**స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి.**

**ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది.**

# బంగారం ధర ఎప్పుడు తగ్గుతుంది? నిపుణులు ఏమంటున్నారు?

బంగారం ధరలు రోజు రోజు భారీగా పెరుగుతున్నాయి. రెండు రోజుల్లో తులం బంగారం రూ. 1300 పైన పెరిగింది. ప్రస్తుతం గ్రాము గోల్డ్ రేటు 7 వేల పైనే ఉంది. మరి ఈ సమయంలో బంగారం కొనుగోలు చేయడం మంచిదేనా? బంగారాన్ని నగల రూపంలో కొంటే బెటరా లేదా బాండ్స్ రూపంలో కొనడం మంచిదా? బంగారం ధరలు పెరిగేందుకు కారణాలేంటి, ఈ పసిడి ధరలు ఎప్పుడు తగ్గుతాయి? ధరలు తగ్గే వరకు వేచి చూడడం మంచిదేనా? బులియన్ మార్కెట్ నిపుణులు ఏమంటున్నారు అనేది ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధర పెరుగుదలతో పోలిస్తే.. తగ్గడం చాలా స్వల్పంగా ఉంది. ఆర్థిక అనిశ్చితి, స్టాక్ మార్కెట్లలో ఒడుదొడుకుల వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారాన్ని భద్రమైన సాధనంగా భావిస్తున్నారు. గోల్డ్ రేట్ల పెరుగుదల వెనుక అంతర్జాతీయ పరిణామాలుఉంటాయి. ప్రపంచ ప్రధాన మార్కెట్లలో లండన్ బులియన్ మార్కెట్ ఒకటి. ధరలను నిర్ణయించేది ఈ మార్కెట్టే. పెద్ద పెద్ద మైనింగ్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు ఈ సంస్థలో ఉన్నారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర 2,256 డాలర్ల స్థాయిలో ట్రేడింగ్ అవుతోంది. 2023 నాటి గరిష్ఠ ధరతో పోలిస్తే 8 శాతం ఎక్కువ. భారత కరెన్సీ విలువ సైతం పడిపోవడం గోల్డ్ ధరలు పెరిగేందుకు కారణమవుతోంది. ప్రతి ఏడాది భారత్ కు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతుంటుంది.

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ధరల పెరుగుదలకు మరో కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గత 20 ఏళ్ల కాలాన్ని గమనించినట్లయితే బంగారం ధరలు క్రమం తప్పకుండా పెరుగుతున్నాయి. దీనికి కారణం దాని డిమాండ్ పెరగడమే. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, ఎన్నికల వాతావరణం, డొనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయన్న ఊహాగానాలు, రాజకీయ పరమైన మార్పులు సైతం బంగారం పెరిగేందుకు కారణమవుతున్నాయి. బంగారం ధర ఎప్పుడు తగ్గొచ్చు? బంగారం ధరల పెరుగుదల 2025 వరకు కొనసాగే అవకాశం ఉందని జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు అంచనా వేస్తున్నాయి. అంటే ఈ ఏడాదంతా ధరలు పెరిగే అవకాశాలే ఉన్నాయని అర్థమవుతోంది. వచ్చే ఏడాదిలో కాస్త ఊరట లభించవచ్చు. బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్న క్రమంలో పసిడిపై పెట్టుబడి పెడితే మంచి రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయితే, నగలు లేదా బంగారు నాణాలు కొనుగోలు చేస్తే మొత్తం ధరలో తరుగు కమిషన్ కింద 20 శాతం పోతుంది. అంటే మీరు రూ.100 పెట్టి బంగారం కొంటే దాని అసలు విలువ రూ.80 మాత్రమే. అదే గోల్డ్ బాండ్ కొనుగోలు చేస్తే నెల నెలా వడ్డీ వస్తుంది. బాండ్స్ పోతాయనే భయం ఉండదు. డిజిటల్ గోల్డ్ ద్వారా 4 కిలోల వరకు కొనుగోలు చేయవచ్చు. వాటిపై పన్ను మినహాయింపులు సైతం లభిస్తాయి.

# లక్ష పెడితే రూ.15 లక్షలు..

ప్రముఖ లాజిస్టిక్ కంపెనీ స్టాక్ అదరగొట్టింది. గత వారం రోజులుగా వరుసగా అప్పర్ సర్క్యూట్‌లో లాక్ అవుతోంది. ఇన్వెస్టర్లకు కాసులు కురిపిస్తోంది. అంతే కాదు గత మూడేళ్లలోనే 1500 శాతం పెరిగి లక్ష పెట్టుబడికి రూ.15 లక్షలు లాభాలు అందించింది. అదే టైగర్ లాజిస్టిక్స్ ఇండియా కంపెనీ స్టాక్. గడిచిన ఆరు సెషన్లలో ప్రముఖ లాజిస్టిక్స్ కంపెనీ అయిన టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. వరుస సెషన్లలో అప్పర్ సర్క్యూట్ కొడుతోంది. అలాగే గత మూడేళ్లలో 1500 శాతం పెరిగి మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించింది. లక్ష రూపాయలకు రూ. 15 లక్షలు లాభాలు ఇచ్చింది. భారతీయ స్టాక్ మార్కెట్ల లో ఇటీవలి కాలంలో మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించిన స్టాక్స్ లో ఒకటిగా నిలిచింది. మార్చి 28, 2024 నుంచి వరుస సెషన్లలో ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్ కొడుతూ వస్తోంది. ఏప్రిల్ 5 వ తేదీ శుక్రవారం నాటి ట్రేడింగ్ చూసుకుంటే మార్కెట్లు ప్రారంభమైన కొద్ది సేపటికే బీఎస్ఈలో ఇంట్రాడే హై వాల్యూ రూ. 58.69 స్థాయిని తాకింది.

కొద్ది సేపటికే 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ లో లాక్ అయింది. సుమారు రూ. 5.65 కోట్ల సర్వీస్ ట్యాక్స్ సంబంధించి కంపెనీకి అనుకూలంగా నిర్ణయం వెలువడినట్లు తెలిసిన క్రమంలో ఈ షేర్లు రాణిస్తున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్ లో సర్వీస్ ట్యాక్స్ గురించి వెల్లడించింది కంపెనీ. 2023, జులై 14, 2022 ఫిబ్రవరి 10 న సర్వీస్ ట్యాక్స్ డిమాండ్ నోటీసులు వచ్చాయని, ఇప్పుడు వాటికిసంబంధించిన నోటీసులపై అనుకూల నిర్ణయం వెలువడినట్లు తెలిపింది. రూ. 5.65 కోట్లలో రూ. 2.64 కోట్ల ట్యాక్స్ ఇప్పటికే చెల్లించినట్లు ట్యాక్స్ విభాగం తేల్చిందని పేర్కొంది. ఈ వార్త రాసే సమయానికి టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ షేరు 5 శాతం లాభంతో రూ. 58.69 వద్ద ట్రేడింగ్ అవుతోంది. గత 5 రోజుల్లోనే 21 శాతానికిపైగా పెరిగింది. ఈ కంపెనీ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 87 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్థాయి రూ. 33.75 వద్ద ఉంది. అలాగే కంపెనీ మార్కెట్ విలువ రూ.620 కోట్లుగా ఉంది. పీఈ రేషియో 51. 76 వద్ద ఉంది. ఈ స్టాక్ గత ఏడాది కాలంలో 56 శాతం లాభపడింది. అయితే, మూడేళ్లలో 1500 శాతం మేర పెరిగింది. అంటే మూడేళ్ల క్రితం లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు ఆ షేర్ విలువ రూ. 16 లక్షలకుపైగా ఉంటుంది. మూడేళ్లలోనే లక్షకు రూ. 15 లక్షలు లాభాలు వచ్చినట్లయింది.

# అదరగొట్టిన హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు.. వరుసగా 7వ రోజు లాభాలే..




హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు తమ ఇన్వెస్టర్లపై కాసులు కురిపిస్తున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాపడ్డాయి. గత వారం రోజుల్లో 6 శాతానికిపైగా పెరిగాయి. నష్టాల నుంచి ఇక తేరుకున్నట్లేనా? ఇప్పుడు షేర్లు పెరిగేందుకు గల కారణాలేంటి? ఓసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు అదరగొడుతున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏప్రిల్ 5వ తేదీన ఈ బ్యాంక్ స్టాక్ 1.5 శాతం మేర లాభంతో ట్రేడింగ్ అవుతోంది. ఈ వార్త రాసే సమయానికి దేశీయ అతిపెద్ద బ్యాంక్ షేర్లు 1.55 శాతం లాభంతో రూ.1551.65 వద్ద కొనసాగుతున్నాయి. అంతకు ముందు రోజు సెషన్‌లో ఈ షేర్లు 3 శాతం మేర లాభపడిన సంగతి తెలిసిందే. అలాగే గత 5 ట్రేడింగ్ సెషన్లలో చూసుకుంటే ఈ బ్యాంక్ షేర్లు సుమారు 6 శాతం మేర లాభపడ్డాయి. అలాగే గత ఏడు వరుస సెషన్లో 8 శాతం మేర పెరిగాయి. మరోవైపు.. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో మూడో త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయి. ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చాయి. అయితే, మళ్లీ క్యూ4 ఫలితాలపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ అందుతున్న క్రమంలోషేర్లు రాణిస్తుడడం గమనార్హం. ఈ క్రమంలోనే షేర్లపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చాయి జెఫ్ఫెరీస్ అండ్ మక్వారీ వంటి చాలా బ్రోకరేజీ సంస్థలు. దీంతో మదుపరులు ఈ షేర్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, వరుస సెషన్లలో లాభాల్లో కొనసాగుతున్న క్రమంలో ఇక ముందు ముందు అదే ట్రెండ్ కొనసాగుతందని చెప్పేందుకు లేదు. ఏప్రిల్ 20వ తేదీన క్యూ4 ఫలితాలు ప్రకటించనుంది. ఆ తర్వాత స్టాక్ ఇదే పాజిటివ్ ట్రెండ్‌లో కొనసాగకపోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి 1757.50 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్థాయి 1363. 55 వద్ద ఉంది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉంది. పీఈ రేషియో 17.35 శాతం, డివిడెండ్ యీల్డ్ 1.23 శాతంగా ఉన్నాయి.

# భారతీయులకు శుభవార్త చెప్పిన జపాన్..



విదేశీ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించి, ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా జపాన్.. తన వీసా విధానంలో మార్పులు చేసింది. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఈ-వీసాను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా చాలా ఈజీగా వీసాలను పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద భారతీయులు సహా పలు దేశాల పౌరులకు వీసా అందజేస్తోంది. ఈ కార్యక్రమం 90 రోజుల వరకు పర్యాటక ప్రయోజనాల కోసం జపాన్‌కు ప్రయాణించాలనుకునే వారికి ఒకే ప్రవేశ స్వల్పకాలిక వీసాను అందిస్తుంది.
అమెజాన్ సమ్మర్ స్పెషల్ ఏ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీల ప్రారంభ ధర రూ. 25,990 మాత్రమే! ఎక్స్ఛేంజి డిస్కౌంట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. భారతీయుల సహా వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్ 'ఈ-వీసా'ను ప్రారంభించింది. పాస్‌పోర్టులలో భౌతిక స్టిక్కర్ల అవసరం లేకుండా ఈ కొత్త విధానాన్ని జపాన్ తీసుకొచ్చింది. ఏప్రిల్ 1, 2024 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా భారతీయ పర్యాటకులు ఆన్‌లైన్‌లోనే వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీఎఫ్ఎస్ గ్లోబల్ ద్వారా నిర్వహిస్తున్న జపాన్ వీసా అప్లికేషన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పర్యాటకుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో వీసా పొందినవారు జపాన్‌లో గరిష్ఠంగా 90 రోజులు ఉండటానికి అనుమతిస్తుంది. అయితే జపాన్‌లో ఎంట్రీకి మాత్రం ఒకే ఒక్కసారి అనుమతి ఉంటుంది. భారతీయులతో పాటు ఇండియాలో నివసిస్తున్న విదేశీయులు కూడా ఈ-వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆస్ట్రేలియా, బ్రెజిల్, కాంబోడియా, కెనడా, సౌదీ అరేబియా, సింగపూర్, దక్షిణాఫ్రికా, తైవాన్, యూఏఈ, యూకే, అమెరికాకు చెందిన పర్యాటకులకు కూడా ఎలక్ట్రానిక్ వీసాకు అర్హులే. ఈ దేశాలు లేదా ప్రాంతాల నివాసితులు, స్వల్పకాలిక వీసాల నుంచి మినహాయింపు పొందినవారు జపాన్ ఈ-వీసా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు విధానం... జపాన్ వీసా అధికారిక వెబ్‌సైట్ దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పొందుపరచాలి. ఫొటోలతో సహా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలి. దరఖాస్తును సమర్పించడానికి తేదీని ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు వివరాలు సహా అపాయింట్‌మెంట్ లెటర్‌తో కూడిన ఈ-మెయిల్ వస్తుంది. దరఖాస్తును అందజేసి.. నిర్ణయం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. వీసా అప్లికేషన్ స్టేటస్‌ని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. విజయవంతంగా ఎంపికైన దరఖాస్తుదారులకు ఎలక్ట్రానిక్ వీసా మంజూరు అవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, భౌతిక వీసా స్టిక్కర్‌లను జారీ చేయడం జరగదు. ప్రయాణ సమయంలో ఎయిర్‌పోర్టుల వద్ద చెక్-ఇన్ సమయంలో తమ డివైజ్‌లలోని వీసా చూపించాల్సి ఉంటుంది. ఈ-వీసాపై ఉన్న డిస్‌ప్లే ఆప్షన్ మీద క్లిక్ చేస్తే సరిపోతుంది.

# ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం..



ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలు క్రమంగా ఇతర ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యాపించాయి. దీంతో భారీ ప్రమాదం జరిగింది. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. రాజధాని రాయ్‌పూర్‌లోని కోటా ప్రాంతంలో ఉన్న ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫారం పేలడంతో ఒక్కసారిగా భారీగా శబ్దంతోపాటు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మంటలు కాస్తా.. పక్కనే ఉన్న మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు అంటుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇక సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి.. ఫైర్ సిబ్బంది.. ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు వ్యాపించడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కూడా అలుముకుంది. వీలైనంత త్వరగా మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇక ట్రాన్స్‌ఫార్మర్ల పేలిన ఘటన జరిగిన సమయంలో కంపెనీలో కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అందులో ఎందరు కార్మికులు ఉన్నారనేది అధికారులు ఆరా తీస్తున్నారు. వారి పరిస్థితి ఎలా ఉంది.. ఎవరైనా చనిపోయారా.. ఎవరికైనా గాయాలు అయ్యాయా అనే విషయాల గురించి ఇంకా ఎలాంటి సమాచారం అందించలేదు. ఇక ఈ ఘటనలో ఎంత ఆస్తి నష్టం సంభవించిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.

# బర్త్ సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల మతం విడిగా నమోదు

గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జనన మరణ నమోదు చట్టానికి కేంద్ర ప్రభుత్వ సవరణలు చేసి.. బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారింది. ఈ చట్టంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం.. అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. అయితే, ఇందులోని నిబంధనలకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవానికి చట్టం అమలుకు రాష్ట్రాల సమ్మతి తప్పనిసరి. ఇకపై జనన ధ్రువీకరణ పత్రాల్లో తల్లిదండ్రులు తమ మతం గురించి వ్యక్తిగతంగా నమోదుచేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 'కుటుంబ మతం' స్థానంలో తల్లి, తండ్రి విడిగా తమ మతం గురించి డిక్లరేషన్ ఇవ్వాలి. ఈ కొత్త నిబంధన కేంద్ర హోంశాఖ నమూనా నిబంధనలకు అనుగుణంగా ఉంది. అయితే, ఇది అమల్లోకి వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసి, వాటి ఆమోదం తప్పనిసరి. దత్తత తీసుకునే తల్లిదండ్రుల కూడా మతాన్ని వ్యక్తిగతంగా నమోదు చేయాలి. జనన, మరణాల నమోదుకు జాతీయ స్థాయి డేటాబేస్ ఏర్పాటు చేయనున్నారు. ఆధార్ నంబర్లు, ఆస్తి రిజిస్ట్రేషన్లు, రేషన్ కార్డులు, ఎలక్టోరల్ రోల్స్, పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్‌తో సహా అనేక ఇతర డేటాబేస్‌లను రిఫ్రెష్ చేయడానికి దీనిని సమర్థంగా ఉపయోగించనున్నారు. గత, వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో జనన మరణ నమోదు (సవరణ) చట్టం బిల్లు 2023కు ఉభయసభలు ఆమోదం తెలిపాయి. ఆగస్టు 1న లోక్‌సభలోనూ, 7న రాజ్యసభలోనూ ఆమోదించారు. అక్టోబర్ 2023 నుంచి విద్యా సంస్థలలో ప్రవేశం, డ్రైవింగ్ లైసెన్స్, ఓటు హక్కు, ఆధార్ నంబర్‌ను పొందడం, వివాహాలను నమోదు, ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందడం వంటి వివిధ ముఖ్యమైన సేవలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. 'జననాలు, మరణాల డేటాబేస్ రూపొందించడంలో ఇది సహాయపడుతుంది. ప్రజా సేవలు, సామాజిక ప్రయోజనాలు, డిజిటల్ రిజిస్ట్రేషన్‌లో సమర్థవంతమైన, పారదర్శకతకు సహకరిస్తుంది'అని హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 'జనన మరణాల నమోదు (సవరణ) చట్టం, 2023 (20 ఆఫ్ 2023)లోని సెక్షన్ 1లోని సబ్-సెక్షన్ (2) ద్వారా దఖలుపడిన అధికారాలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 1 నుంచి చట్టంలోని నిబంధనలు అమల్లోకి వస్తాయని' అని నోటిఫికేషన్ పేర్కొంది.

# ప్రపంచ క్యాన్సర్ రాజధానిగా భారత్..



ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న కేన్సర్ మరణాల్లో దాదాపు సగం ధూమపానం, మద్యం సేవించడం, అధికబరువు వంటి కారణాలే కారణమని పలు అధ్యయనాల్లో వెల్లడయ్యింది. ఇక, దేశంలో కేన్సర్ భారినపడుతోన్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగతూ ఉండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న వయసు పిల్లలు సైతం దీని బారిపడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఏడాదికి 40 వేల నుంచి 50 వేల మంది చిన్నారులు మహమ్మారి బారిన పడేవారు.
కేన్సర్ వ్యాధిపై ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఏటా లక్షల మందిని ఈ మహమ్మారి బలితీసుకుంటోంది. ఇక, భారత్ కేన్సర్‌కు రాజధానిగా మారిపోయిందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. కేన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ), హృద్రోగం, మానసిక సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధులు తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా కేన్సర్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ప్రపంచ కేన్సర్ రాజధానిగా భారత్ తయారైందా? అన్న స్థాయిలో పరిస్థితి ఉందని పేర్కొంది. 'హెల్త్ ఆఫ్ ది నేషన్' పేరుతో అపోలో హాస్పిటల్స్ గురువారం విడుదల చేసిన నాలుగో వార్షిక నివేదికలో పలు సంచలన విషయాలు ఉన్నాయి. చిన్నపిల్లలు పలు అసాంక్రమిక వ్యాధుల బారినపడటం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, దీనిని నివారించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని నివేదిక సూచించింది. కేన్సర్ విషయంలో కూడా ఇది కనిపిస్తోందని, ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో ఈ వ్యాధి బారినపడుతున్న వారి సగటు వయసు చాలా తక్కువగా ఉంటోందని వివరించింది. దేశంలో రొమ్ము, గర్భాశయం, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతునప్పటికీ, నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం చాలా తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. అలాగే, స్థూలకాయం (ఒబిసిటీ) కూడా భారతీయ యువతలో పెరిగిపోతోందని, ఇది పలు అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతోందని తెలిపింది.
అంతేకాదు, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ)ల ముప్పును పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారని వెల్లడయ్యింది. యువతలో మానసిక సమస్యలు ముఖ్యంగా కుంగుబాటు (డిప్రెషన్) అధికంగా కనిపిస్తోందని తేలింది. ఈ నివేదికపై అపోలో హాస్పిటల్స్ వైస్-ఛైర్మన్ డాక్టర్ ప్రీతా రెడ్డి మాట్లాడుతూ.. అసాంక్రమిక వ్యాధులను ఎదుర్కోవటానికి తక్షణం సమష్టి కార్యాచరణ అవసరమని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు వ్యక్తిగత స్థాయిలో చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఆవశ్యకత ఉందని చెప్పారు.
వైద్య చికిత్సలకు సంబంధించి మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని, వాటిని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని అపోలో సంస్థల ఛైర్మన్, సీఈఓ డాక్టర్ మధు శశిధర్ సూచించారు. ఈ మేరకు అపోలో 'ప్రో హెల్త్ స్కోర్' పేరుతో దేశంలోనే తొలి డిజిటల్ హెల్త్ కౌంటింగ్ టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా తమ ఆరోగ్యంపై స్వీయ అంచనాకు వచ్చి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఓ ప్రకటనలో తెలిపింది. అసాంక్రమిక వ్యాధులు దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.లక్షల కోట్ల మేర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో.. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ టూల్ ఎంతో ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

## మృణాల్ ఠాకూర్ మెచ్చిన గేమ్ ఛేంజర్ పాట..

రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ ఎంత పెద్ద డిజాస్టర్‌గా నిలిచిందో అందరికీ తెలిసిందే. ఐదారు వందల కోట్ల టార్గెట్‌తో బరిలోకి దిగిన ఈ మూవీ కనీస వసూళ్లను కూడా సాధించలేకపోయింది. మొత్తంగా ఈ మూవీకి వంద కోట్ల షేర్ వచ్చిందా? అన్నది కూడా అనుమానమే. ఇక ఈ మూవీని అందరూ గాలికి వదిలేశారు. దిల్ రాజు అయితే రిలీజ్ రోజు నుంచే ఈ మూవీని వదిలేశాడు.

రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. కనీసం తమన్ సైతం తన పాటలతో సినిమా మీద హైప్ పెంచలేకపోయాడు. జరగండి, రా మచ్చ ఇలా ఏ పాట కూడా జనాలను అంతగా మెప్పించలేదు. తమన్ ఇచ్చిన ఏ పాట కూడా ఛార్ట్ బస్టర్‌గా నిలవలేదు. అన్ని పాటల్లోకెల్లా నా నా హైరానా అంతో ఇంతో జనాల్లో నానింది. ఇప్పుడు రీల్స్, ప్రీ వెడ్డింగ్ షూట్లకు ఎక్కువగా ఈ పాటని వాడుతున్నారు. కానీ ఈ పాటను ఫస్ట్ రోజు సినిమాలో పెట్టలేదు. పది కోట్లు పెట్టి తీసిన ఈ పాటను ఫస్ట్ డే నాడు ప్లే చేయకపోవడం ఏంటని అంతా విమర్శించారు. అయితే నానా హైరానా పాటను రెండో రోజు నుంచే థియేటర్లోకి వదిలారు. ఈ పాటే కాస్త పాజిటివిటీ పెంచేలా ఉందని, ఆ పాట కూడా తీసేస్తే ఎలా అని చాలా మంది ట్రోలింగ్ చేశారు. దీంతో ఆ పాటను యాడ్ చేశారు. కానీ అప్పటికే నష్టం జరిగిపోయింది. ఇక సినిమాకు పాజిటివ్ టాక్ రాకపోవడంతో అసలు ఆ పాటల్ని కూడా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఒక్క పాట కూడా మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా లేకపోవడంతో అందరికీ ఇంట్రెస్ట్ పోయింది. ఇప్పుడు నా నా హైరానా పాట మాత్రం బాగానే ట్రెండ్ అవుతోంది. ఇక ఈ పాటే తనకు ఇప్పుడు ఫేవరేట్ అని మృణాళ్ సైతం హమ్ చేస్తోంది. ఎయిర్ పోర్టులో ఇలా తన ఫ్రెండ్స్‌తో కలిసి మృణాళ్ ఈ పాటను హమ్ చేస్తూ కనిపించింది. రీసెంట్‌గా మృణాళ్ ఠాకూర్ చెన్నైలో జరిగిన కాలేజ్ ఈవెంట్లో కనిపించింది. ఇక ఎన్టీఆర్ ఫ్యాన్స్ అయితే ఆమె మూమెంట్స్‌ను ఎక్కువగా వైరల్ చేశారు. అడివి శేష్‌తో డెకాయిట్ మూవీని ఫినిష్ చేసినట్టుగా సమాచారం అందుతోంది.



## ప్రభాస్‌పై కామెంట్స్



రైటర్ తోట ప్రసాద్ తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కన్నప్ప మూవీకి తోట ప్రసాద్ రైటర్‌గా పని చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తోట ప్రసాద్ ప్రభాస్‌తో పని చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నాడు. కన్నప్ప కోసం పని చేసిన సంగతుల్ని పంచుకున్నాడు. ప్రస్తుతం తోట ప్రసాద్ మాట్లాడిన మాటలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్ తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నా సాయం చేశాడన్న రైటర్.

రైటర్ తోట ప్రసాద్ తాజాగా ప్రభాస్ గొప్పదనం గురించి చెప్పాడు. బిల్లా కోసం పని చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నాడు. బిల్లా డిస్కషన్ గురించి వెళ్లినప్పుడు ప్రభాస్ ఇచ్చిన ఆతిథ్యం గురించి గొప్పగా చెప్పాడు. ఇవన్నీ కాకుండా తాను హాస్పిటల్లో చేరిన రోజులు, ఆ టైంలోనే ప్రభాస్ తండ్రి కూడా మరణించడం.. అయినా కూడా ప్రభాస్ తన గురించి ఆలోచించి.. కొంత అమౌంట్ పంపిన విషయాల్ని గుర్తు చేసుకుని ఎమోషనల్ అయ్యాడు.

రైటర్ తోట ప్రసాద్ ప్రస్తుతం కన్నప్ప సినిమాకి పని చేశాడు. అందులో ప్రభాస్ సీన్లకు కూడా స్పెషల్‌గా తోట ప్రసాద్ ఎలివేషన్స్ ఇచ్చాడట. ఇక తోట ప్రసాద్ తనకు ప్రభాస్‌తో ఉన్న రిలేషన్‌ను గుర్తు చేసుకున్నాడు. 2010లో ఆరోగ్యం బాగా లేకపోవడంతో తాను హాస్పిటల్‌లో చేరానని చెప్పుకొచ్చాడు. ఆ టైంలోనే ప్రభాస్ తండ్రి సూర్య నారాయణ రాజు కూడా మరణించారని తోట ప్రసాద్ తెలిపారు.



తండ్రి మరణించిన బాధలో ఉన్నా కూడా ప్రభాస్.. తన గురించి ఆలోచించాడని తోట ప్రసాద్ ఎమోషనల్ అయ్యాడు. తండ్రి మరణించడం అంటే ఎంతటి బాధలో ఉంటారో అర్థం చేసుకోవచ్చు.. అలాంటి టైంలోనూ తన రైటర్ గురించి ప్రభాస్ ఆలోచించి.. పర్సనల్‌గా ఓ మనిషిని పంపి.. కావాల్సిన డబ్బుని కూడా ఏర్పాటు చేశాడు.. అదే ప్రభాస్ గొప్పదనం అంటూ తోట ప్రసాద్ చాలా ఎమోషనల్ అయిపోయాడు.

పాన్ ఇండియన్ స్టార్‌గా ప్రభాస్‌కు ప్రస్తుతం మినిమం ఐదు వందల కోట్ల కలెక్షన్స్ వస్తాయి. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్‌కు కలెక్షన్స్ వస్తాయి. ప్రస్తుతం ప్రభాస్ రాజా సాబ్, ఫౌజీ చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఆ తరువాత కల్కి 2, సలార్ 2 వంటి చిత్రాలను కూడా పట్టాలెక్కిస్తాడు. ఇక ఈ మధ్యలోనే సందీప్ రెడ్డి వంగాతో స్పిరిట్ మూవీని కూడా స్టార్ట్ చేయాల్సి ఉంది. కానీ ఇంత వరకు స్పిరిట్ పట్టాలెక్కలేదన్న సంగతి తెలిసిందే.

## హిట్ 3 టీజర్ రిలీజ్..



నాని బర్త్ డే సందర్భంగా హిట్ 3 టీజర్‌ను రిలీజ్ చేశారు. శైలేష్ కొలను మరింత వయలెంట్‌గా మారినట్టు అనిపిస్తోంది. ఇందులో నాని ఇది వరకు కనిపించనంత యాంగ్రీగా కనిపిస్తున్నాడు. టీజర్ కాబట్టి.. డైలాగ్స్‌కి, యాక్షన్ సీక్వెన్స్‌కి సెన్సార్ చేయించలేదేమో. ఇందులో చూపించిన సీన్లు, డైలాగ్స్ సినిమాలో ఉంటాయో లేవో కూడా అర్థం కావడం లేదు. శైలేష్ కొలను సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా హిట్ ఫ్రాంచైజీలు వస్తున్న సంగతి తెలిసిందే. హిట్ 1లో విశ్వక్ సేన్, హిట్ 2లో అడివి శేష్ అదరగొట్టేశారు. ఇక హిట్ 3లో అర్జున్ సర్కార్ అంటూ నాని మెప్పించబోతోన్నాడు. ఈ మూడో పార్టు మరింత వయలెంట్‌గా ఉండబోతోందని తాజాగా రిలీజ్ చేసిన టీజర్‌ను చూస్తే అర్థం అవుతోంది. నాని బర్త్ డే (ఫిబ్రవరి 24) సందర్భంగా వదిలిన హిట్ 3 టీజర్ ఇప్పుడు నెట్టింట్లో తెగ వైరల్ అవుతోంది. నానిని శైలేష్ కొలను యాంగ్రీ యంగ్ మెన్‌గా చూపించాడు. నాని సైతం ఇది వరకు కనిపించనంత రఫ్‌గా, టఫ్‌గా కనిపిస్తున్నాడు. నాని నోటి బూతుల్ని కూడా పలికించారు. ఇక యాక్షన్ సీక్వెన్సులు, ఆ బ్లడ్ బాత్ చూస్తుంటే యానిమల్ అమ్మ మొగుడు, యాంగర్ ఇష్యూలో అర్జున్ రెడ్డికి తాత అన్నట్టుగా కనిపిస్తోంది. ప్రస్తుతం నాని హిట్ 3 టీజర్ అయితే చాలా రీఫ్రెషింగ్‌గా, కొత్తగా అనిపిస్తోంది. లాఠీతో కొట్టే సీన్లు, చివర్లో ఆ షాట్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి.

హిట్ 1, హిట్ 2 లోకల్‌గా జరిగాయి. మరి ఈ మూడో పార్టుని కాశ్మీర్‌లోకి తీసుకెళ్లారు. ఆ రెండు పార్టులకు, ఈ మూడో పార్టుకి శైలేష్ కొలను ఎలా లింక్ చేస్తాడో చూడాలి మరి. విశ్వక్ సేన్, అడివి శేష్ వంటి వారిని ఈ మూడో పార్టులో చూపిస్తారా? వారితో ఏమైనా సీన్లు ఉంటాయా? అన్నది చూడాలి. ఈ మూవీ తరువాత మళ్లీ శైలేష్ కొలను నాలుగో పార్ట్ ఎవరితో తీస్తారో అని ఇప్పటి నుంచే చర్చలు మొదలయ్యాయి. హిట్ నాలుగో పార్టులో బాలయ్య కనిపిస్తాడని ఆ మధ్య కొన్ని రూమర్లు వచ్చాయి. మరి శైలేష్ కొలను మైండ్‌లో ఏ హీరో ఉన్నాడో.. ఇదే ఇంత వయలెంట్‌గా ఉందంటే.. నాలుగో పార్ట్ ఇంకెంత వయలెంట్‌గా ఉంటుందో చూడాలి. విశ్వక్, అడివి శేష్, నాని ఇలా అందరూ కలిసి ఏ పార్టులో కనిపిస్తారో మరి.

## హీరో జాయిన్ ఎప్పుడంటే?



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో మూవీ కోసం ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో ఎన్టీఆర్-నీల్ మూవీ రూపొందుతోంది. ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ మొదలైంది. పెద్ద ఎత్తున జూనియర్ ఆర్టిస్టులతో ప్రశాంత్ నీల్ షూట్ చేస్తున్న ఫోటోను షేర్ చేశారు. ఎన్టీఆర్ లేకుండానే షూట్ జరుగుతోంది. మార్చి మూడో వారం నుంచి ఎన్టీఆర్ షూట్‌కి హాజరు కాబోతున్నారని సమాచారం. ఈలోపు ఎన్టీఆర్ లేని క్రౌడ్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారని టాక్. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కేజీఎఫ్, సలార్ సినిమాలతో దర్శకుడు ప్రశాంత్ నీల్ స్థాయి అమాంతం పెరిగింది. టాలీవుడ్ జక్కన్న రాజమౌళి తర్వాత సౌత్ నుంచి ఆ స్థాయి సినిమాలు తీయగల సత్తా ప్రశాంత్ నీల్‌కి ఉందని అంటారు. భారీ పాన్ ఇండియన్ ప్రాజెక్టులకు ప్రశాంత్ నీల్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాడు. సలార్ సినిమా ఆశించినంతగా ఆడకపోవడంతో కాస్త గ్యాప్ తీసుకున్నాడు. మధ్యలో అసలు సలార్ 2 ఉంటుందా? లేదా? అనే చర్చలు కూడా జరిగాయి. కానీ హొంబలే, పృథ్వీరాజ్, ప్రశాంత్ నీల్ ఇలా అందరూ సలార్ 2 ఉంటుందని మాట్లాడుతూ వస్తున్నార.

సలార్ 2కి టైం పట్టేలా ఉందని ప్రశాంత్ నీల్ మొత్తం ఫోకస్‌ను ఎన్టీఆర్ ప్రాజెక్ట్ మీద పెట్టాడు. ప్రస్తుతం ఎన్టీఆర్ – నీల్ షూటింగ్ స్టార్ట్ అయింది. సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. షూటింగ్ ప్రారంభమైనట్టుగా మేకర్లు అధికారికంగా ప్రకటించారు. ఎన్టీఆర్ కూడా ఇక త్వరలోనే తాను కూడా జాయిన్ అవుతానని ట్వీట్ వేశాడు. వేలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో ప్రశాంత్ నీల్ షూటింగ్ చేస్తున్న ఫోటో నెట్టింట్లో బాగానే ట్రెండ్ అయింది.

రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ఈ షూటింగ్‌లో భారీ క్రౌడ్ సన్నివేశాలను, యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన షాట్స్‌ని షూట్ తీస్తున్నారు. ఎన్టీఆర్ లేకుండానే ఈ షూట్ జరుగుతోందని సమాచారం. అతి త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌కి ఎన్టీఆర్ జాయిన్ కాబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం మార్చ్ మూడో వారం నుంచి ఎన్టీఆర్ ఆ సినిమా షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు.

పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్ లుక్ విభిన్నంగా ఉంటుందని సమాచారం అందుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్ నటిస్తుందని టాక్ వినిపిస్తోంది. మరో ముఖ్య పాత్రలో టొవినో థామస్ కనిపించబోతున్నారని అంటున్నారు. ఈ సినిమాకు డ్రాగన్ అనే వర్కింగ్ టైటిల్‌ను పెట్టారని సమాచారం. త్వరలోనే సినిమా షూట్‌లో ఎన్టీఆర్ జాయిన్ కాబోతున్న నేపథ్యంలో ఫస్ట్ లుక్‌పై అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.

ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రశాంత్ నీల్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తారేమో చూడాలి. మరో వైపు ఎన్టీఆర్ బాలీవుడ్ మూవీ 'వార్ 2' షూటింగ్‌లోనూ పాల్గొంటున్నారు. మరో కీలక షెడ్యూల్‌తో వార్ 2 షూటింగ్ పూర్తి కానుందని సమాచారం అందుతోంది. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న వార్ 2 లో ఎన్టీఆర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ ప్రాజెక్టుల తరువాత మళ్లీ దేవర 2 మీద ఎన్టీఆర్ ఫోకస్ పెట్టనున్నాడు.

## ఒకే ఫ్రేమ్‌లో



టాలీవుడ్ ప్రముఖులు చాలా మంది ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి దుబాయ్ వెళ్లిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్, ఎన్టీఆర్, సుకుమార్ ఇలా అందరూ తమ తమ ఫ్యామిలీ మెంబర్లతో వచ్చారు. నమ్రత, ఉపాసన, ప్రణతి ఇలా అందరూ లేడీస్ పార్టీల్లో కలిసి సందడి చేస్తున్నారు. నమ్రత కంటిన్యూగా ఫోటోలను షేర్ చేస్తూ ఉన్నారు. ఇక ఉపాసన సైతం ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫోటోలను షేర్ చేస్తూనే ఉన్నారు. షిర్డి సాయి సినిమా నిర్మాత మహేష్ రెడ్డి కొడుకు నితిష్ రెడ్డి పెళ్లి వేడుకకు టాలీవుడ్ ప్రముఖులంతా కదిలారు. ఈ పెళ్లి వేడుకలో అఖిల్ అయితే నాటు నాటు స్టెప్పులకు డ్యాన్స్ వేశాడు. నితీష్, కీర్తి పెళ్లి వేడుకల్లో టాలీవుడ్ టాప్ సెలెబ్రిటీలు ఫ్యామిలీస్‌తో సహా వచ్చి సందడి చేస్తున్నారు. ఇక ఇదే ఊపులో మన సెలెబ్రిటీలు అక్కడ జరిగిన ఇండియా పాకిస్థాన్ మ్యాచ్‌ని కూడా చూశారు. ఇక మన సెలెబ్రిటీల ఫోటోలు బయటకు వస్తుంటే అవి తెగ వైరల్ అవుతున్నాయి.

## క్షమాపణలు చెప్పిన ఛావా దర్శకుడు



ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన 'ఛావా' సినిమా వరల్డ్ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతోంది. ఇప్పటికే రూ. 310 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు మేకర్స్ ప్రకటించారు. 'పుష్ప 2' తర్వాత సెకండ్ వీకెండ్‌లో రూ. 100 కోట్లు సాధించిన బాలీవుడ్ మూవీగా రికార్డ్ సృష్టించినట్లు తెలుస్తోంది. ఇంతటి ఘన విజయం సాధించిన ఈ సినిమా చుట్టూ ఇప్పుడు ఓ వివాదం రాజుకుంది. సినిమాలో తమ పూర్వీకులను తప్పుగా చూపించారు అని గానోజీ, కన్హోజీ షిర్కే వారసులు ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయ పోరాటం చేయడానికి రెడీ అయ్యారు. 'ఛావా' చిత్ర బృందానికి గానోజీ, కన్హోజీ వారసులు ఇప్పటికే లీగల్ నోటీసులు పంపించారు. సినిమాలో తమ పూర్వీకులను అవమానిస్తూ ఉన్న సన్నివేశాలను తొలగించాలని అందులో పేర్కొన్నారు. లేకుంటే రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామంటూ హెచ్చరించారు. దాంతో దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టారు. గానోజీ, కన్హోజీ వారసులతో ఫోన్‌లో మాట్లాడి క్షమాపణలు చెప్పారట. గానోజీ, కన్హోజీలను తప్పుగా చూపించే ఉద్దేశం తమకు లేదని, అందుకే సినిమాలో వారు ఏ ప్రాంతానికి చెందినవారనేది చూపించలేదని అన్నారట. ఈ మేరకు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

సినిమాలో శంభాజీ మహారాజ్ ఎంతో నమ్మకం పెట్టుకున్న గానోజీ, కన్హోజీలు ఔరంగజేబుతో కలుస్తారు. వారు ఇచ్చిన సమాచారం కారణంగానే శంభాజీని ఔరంగజేబు పట్టుకున్నారనే విధంగా 'ఛావా' సినిమాలో చూపించారు. ఆ సన్నివేశాలను గానోజీ, కన్హోజీ వంశస్తులు తప్పుబడుతున్నారు. అందుకు తగ్గ ఆధారాలు లేకుండా తమ పూర్వీకులను ఎలా తప్పుగా చూపిస్తారని దర్శకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ క్షమాపణలు చెప్పారు.

'ఛావా' సినిమాలో శంభాజీ మహారాజ్ గా విక్కీ కౌశల్, ఆయన భార్య యేసుబాయి పాత్రలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటించింది. ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా నటించారు. ఇప్పటికే ఈ సినిమాని పలువురు రాజకీయ ప్రముఖులు ప్రశంసించారు. భారత ప్రధాని మోదీ సైతం ఈ సినిమాపై మాట్లాడారు. దేశం మొత్తం ఛావా గాలి వీస్తోందని ఆయన అన్నారు.

## కలిసి వస్తుందా? కొంప ముంచుతుందా?

సందీప్ కిషన్ మజాకా ట్రైలర్ చూసిన తరువాత సినిమా మీద అందరికీ ఓ క్లారిటీ అయితే వచ్చి ఉంటుంది. కాస్త క్రింజ్ కామెడీ టైపులా మజాకా కనిపిస్తోంది. కానీ ఇందులో ఉన్న ఎమోషన్ కనుక జనాలకు కనెక్ట్ అయితే సినిమా హిట్ అవుతుంది. ఇక ఈ ఎమోషన్‌కు తగ్గ కామెడీ ట్రాక్ కూడా సెట్ అయితే మాత్రం వంద కోట్లు వచ్చే అవకాశం కూడా ఉంది. తాజాగా మజాకా టీం ఓ నిర్ణయం తీసుకుంది. ట్రెండ్‌ను ఫాలో అవుతూ పెయిడ్ ప్రీమియర్లకు ఓకే చెప్పేసినట్టుగా కనిపిస్తోంది. అసలే ఇప్పుడు టాలీవుడ్‌లో ఈ పెయిడ్ ప్రీమియర్ల కల్చర్ నడుస్తోంది. పెద్ద సినిమాలు అయితే మిడ్ నైట్ షోల ట్రెండ్ నడుస్తోంది. ఇలా చిన్న చిత్రాలు, మిడ్ రేంజ్ చిత్రాల మేకర్లు తమ కంటెంట్ మీద నమ్మకం ఉంటే.. పెయిడ్ ప్రీమియర్లకు వెళు‌న్నారు. మరి మజాకా లాంటి అవుడ్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్లకు పెయిడ్ ప్రీమియర్లు అంటే.. కలిసి వస్తుందా? కొంప ముంచుతుందో చూడాలి.

క్రింజ్ కామెడీ, బోరింగ్ అనే మాటలు బయటకు వస్తే మాత్రం డే వన్ నుంచే మజాకాకు



గండం మొదలవుతుంది. ఒక వేళ పెయిడ్ ప్రీమియర్ల నుంచి మంచి టాక్ వస్తే మాత్రం మొదటి రోజు నుంచే ఊపందుకుంటుంది. కానీ ఒక్కసారి ఒక చోట షో పడ్డాక అసలు టాక్‌ను బయటకు రాకుండా ఆపలేం. ఈ పెయిడ్ ప్రీమియర్లతో ఎంత లాభం ఉంటుందో అంతే నష్టం కూడా ఉంటుంది. మేకర్లు తమకు కంటెంట్ మీద నమ్మకం ఉండి, సినిమా మీద ఎంతో నమ్మకం ఉంటే తప్పా ఆ ఆప్షన్‌ను ఎంచుకోరు. మరి మజాకా మూవీకి మంచి పాజిటివ్ టాక్ వచ్చి సందీప్ కిషన్‌కు మరో హిట్ వస్తే లెక్కలన్నీ మారిపోతాయి. సందీప్ కిషన్ ఈ మూవీతో కెరీర్ హయ్యస్ట్ కొడతానని, నంబర్ల గురించి అంతా మాట్లాడుకుంటారని కూడా చెబుతున్నాడు.

## దిల్ రాజు పట్టించుకుంటాడా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ షణ్ముగం దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ లో దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. తమ ప్రొడక్షన్ లో గోల్డెన్ జూబ్లీ 50వ సినిమా కావడంతో భారీగా ఖర్చు పెట్టి సినిమా తీశారు. 'గేమ్ ఛేంజర్' మూవీ టీం తమను మోసం చేసిందంటూ కొందరు జూనియర్ ఆర్టిస్టులు తాజాగా గుంటూరు పోలీస్ స్టేషన్లో కంప్లెయింట్ చేసారు. సినిమా షూటింగ్ కోసం గుంటూరు, విజయవాడ నుండి హైదరాబాద్ కి 350 మంది వెళ్లామని, కోడైరెక్టర్ స్వర్గం శివ తమకు రూ. 1200 ఇస్తానని ఒప్పుకొని డబ్బులు ఇవ్వట్లేదని ఆరోపంచారు. ఈ మేరకు ఆర్టిస్ట్ తరుణ్ తో సహా పలువురు పోలీసులకు ఫిర్యాదు చేసారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని, స్వర్గం శివపై చర్యలు తీసుకోవాలని కోరారు."శంకర్ ఆధ్వర్యంలో 'గేమ్ చేంజర్' సినిమా చేశాం. దర్శకుడు శంకర్, నిర్మాత దిల్ రాజు చొరవ తీసుకొని మాకు డబ్బులు ఇప్పించి తగిన న్యాయం చేయాలి. మోసం చేసిన స్వర్గం శివను తక్షణమే అరెస్ట్ చేయాలని పోలీసులను కోరుతున్నాం" అని జూనియర్ ఆర్టిస్టులు అన్నారు. గేమ్ ఛేంజర్ మూవీ ఆర్టిస్టులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేసారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,